


## వరద నష్టాలపై స్పష్టమైన నివేదిక రూపొందించాలి

■ కలెక్టర్ల వీడియోకాన్ఫరెన్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం


# ప్రభాత సమాచారం

https: epaper.prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ మంగళవారం । 2 సెప్టెంబర్ 2025 । ■ 15 పేజీలు




## విజృంభిస్తున్న..

# విష జ్వరాలు



- విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- వైరల్ ఫీవర్, టైఫాయిడ్, డెంగ్యూ, చికున్ గున్యాలతో సతమతం
- ఆస్పత్రులకు పరుగులు తీస్తున్న ప్రజలు
- చికిత్స, మందుల కోసం రూ. వేలల్లో ఖర్చు
- మంచిర్యాల జిల్లాలో డెంగీ ఫియర్
- వానకాలంలో వ్యాధులు ప్రబలకుండా యంత్రాంగం జాగ్రత్తలు
- పరిశుభ్రతపై ఊరూరా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు

మంచిర్యాల జిల్లాలో డెంగీ ఫీవర్ భయపడుతున్నది. పట్టణాలు, పల్లెల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారి దోమలు విజృంభిస్తుండగా, రోజు రోజుకూ కేసుల సంఖ్య పెరుగుతున్నది. ఇప్పటి వరకు టీ హబ్‌లో 2 వేలకు పైగా పరీక్షలు నిర్వహించగా, 25 పాజిటివ్ కేసులు వచ్చినట్లు తేలింది. డెంగీ వచ్చిన వారంతా ప్రైవేట్ హాస్పిటళ్లకు పరుగులు పెడుతుండగా, యజమానులు ఇదే అదనుగా భావించి రూ.లక్షలు దండుకుంటున్నట్లు తెలుస్తున్నది. నిన్నమొన్నటి వరకు ప్రతి రోజూ ప్రభుత్వ దవాఖానకు 400 మంది ఓపీ పేషెంట్లు రాగా, ప్రస్తుతం ఆ సంఖ్య 1000కి పైగా పెరగడం ఆందోళనకు గురిచేస్తున్నది.ఓ వైపు డెంగీ టెన్షన్ పెడుతుంటే.. మరోవైపు సీజనల్ వ్యాధులు విజృంభిస్తూ ఆందోళనకు గురిచేస్తున్నాయి. పల్లెలు, పట్టణాల్లో జ్వరబాధితులు పెరుగుతున్నారు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసింది. జిల్లా మలేరియా నియంత్రణ అధికారి, మలేరియా నియంత్రణ సహాయ అధికారి, ముగ్గురు సబ్ యూనిట్ ఆఫీసర్లు ఉన్నారు. వీరు ఎప్పటికప్పుడు సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేస్తున్నారు.



14

## నిర్ణీత గడువులోగా నిమజ్జనం పూర్తి చేయాలి

- ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి
- నిమజ్జనంలో డీజేలకు అనుమతి లేదు
- యువతతో నేరుగా మాట్లాడిన ఎస్పీ అఖిల్ మహాజన్
- పట్టణంలోని పలు ప్రధాన గణేష్ మండపాల సందర్శన

7



గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ప్రశాంత వాతావరణంలో జరగడానికి యువతతో నేరుగా మాట్లాడుతూ పోలీసులు, ప్రజల మధ్య సత్సంబంధాలను మెరుగుపరచడానికి జిల్లా పోలీసు యంత్రాంగం కృషి చేస్తుందని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని పలు ప్రధాన గణేష్ మండపాలను జిల్లా ఎస్పీ పరిశీలించారు. మండపాల ప్రత్యేక పూజలు నిర్వహించారు.



### బీసీల రిజర్వేషన్

## చారిత్రాత్మక నిర్ణయం

అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఏకగ్రీవ ఆమోదం పట్ల జిల్లా కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఏఐసీసీ టీపీసీసీ ఆదేశాల మేరకు సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాసేవ భవన్ నుంచి సోమవారం ర్యాలీ నిర్వహించారు. రేవంత్ రెడ్డికి ప్రభుత్వానికి మద్దతుగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. బీసీ నేతలందరు ప్రభుత్వానికి సీయం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ ప్రముఖుల ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు.



### లక్ష ఎకరాలకు నీరందించిన

# ఘనత కేసీఆర్‌దే

- తెలంగాణ తొలి సీఎంపై రేవంత్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి
- బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నేతలు ■ హామీలు అమలు చేయకే ఆరోపణలే
- అన్నారం బ్యారేజ్ నీటితో కేసీఆర్ చిత్రపటాలకు జల, పాలాభిషేకాలు
- పలువురి అరెస్టు.. పోలీస్ స్టేషన్‌కు తరలింపు

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి లక్ష ఎకరాలకు సాగు నీరందించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ అన్నారు. బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ బాల్క సుమన్ పిలుపు మేరకు సోమవారం మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం అన్నారం బ్యారేజ్ వద్ద నాయకులతో కలిసి కేసీఆర్ చిత్ర పటానికి కాళేశ్వరం జలాలతో అభిషేకం చేశారు.

### ప్రభుత్వం రైతులకు

## అండగా ఉంటుంది



### కేంద్రం నిర్లక్ష్యంతోనే

# యూరియా కొరత

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రహమత్ హుస్సేన్



వివరాలు 11లో

# ఎస్‌బీఐ స్కాంలో 44 మంది అరెస్టు

- చెన్నూరు ఎస్‌బీఐ-2లో బంగారం, నగదు మాయం మిస్టరీ వీడింది - క్యాషియరే ప్రధాన సూత్రధారి.. పనిచేసిన బ్యాంకుకే కన్నం - సహకరించిన మేనేజర్, అవుట్ సోర్సింగ్ అటెండర్
- 25.17 కిలోల బంగారం, 1.10 కోట్ల నగదు లూటీ - ప్రైవేట్ గోల్డ్ లెండింగ్ కంపెనీల్లో తాకట్టు పెట్టి లోన్లు
- ప్రధాన నిందితుడు క్యాషియర్ సహా 44 మంది అరెస్టు - 15.237 కిలోల బంగారు ఆభరణాలు, 1,61,730 నగదు రికవరీ



**చెన్నూర్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)** మంచిర్యాల జిల్లా చెన్నూరు ఎస్‌బీఐ-2లో తాకట్టు బంగారం, నగదు మాయం కేసు మిస్టరీ వీడింది. బ్యాంక్ క్యాషియర్ నరిగే రవీందరే ప్రధాన సూత్రధారి అని, మేనేజర్‌తోపాటు అవుట్ సోర్సింగ్ ఉద్యోగి కలిసి ఈ ఘరానా మోసానికి పాల్పడినట్లు తేలింది. ఈ కేసులో క్యాషియర్ సహా 44 మందిని పెద్దపల్లి జిల్లా రామగుండం కమిషనరేట్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్‌లో విలేకరులతో సీపీ అంబర్ కిశోర్ ఝా వివరాలు వెల్లడించారు. బ్యాంకు లో 12.61 కోట్ల విలువైన 402 గోల్డ్‌లోన్ ఖాతాల ఆభరణాలు (25.17కిలోల బంగా రం), నగదు 1.10 కోట్లు గల్లంతైనట్లు గుర్తించిన బ్యాంకు రీజనల్ మేనేజర్ రితేశ్‌కుమార్ గుప్తా గత నెల 23న చెన్నూరు ఠాణాలో ఫిర్యాదు చేశారు.

**క్యాషియరే ప్రధాన సూత్రదారి..**

నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలతో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ దర్యాప్తు చేపట్టారు. బ్యాంకు క్యాషియర్ నరిగె రవీందర్ ఖాతాలో భారీగా అనుమానాస్పద డిపాజిట్లు కలిగి ఉండడంతో అతన్ని ప్రధాన నిందితుడిగా అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. రవీందర్ గతేడాది ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో 40లక్షల దాకా పోగొట్టుకున్నాడు. జరిగిన నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు మళ్లీ బెట్టింగ్ ఆడాలని నిర్ణయించుకున్నాడు. బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ వెన్నపురెడ్డి మనోహర్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి లక్కాకుల సందీప్‌తో కలిసి తాకట్టు బంగారం మాయం చేయాలని స్కెచ్ వేశాడు.

మేనేజర్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సహకారంతో క్యాషియర్ గతేడాది అక్టోబర్‌లో తరచూ గోల్డ్‌లోన్ చెస్ట్ నుంచి బంగారం తీసి తన స్నేహితులు మంచిర్యాల ఎస్‌బీఎఫ్‌సీ సేల్స్ మేనేజర్ కొంగోండి బీరేశ్, కస్టమర్ రిలేషన్ మేనేజర్ కొడాటి రాజశేఖర్, సేల్స్ ఆఫీసర్ బొల్లి కిషన్‌కు అప్పగిస్తూ వచ్చాడు. వీరు ఆ బంగారాన్ని ప్రైవేట్ ఫైనా న్స్ కంపెనీల్లో తాకట్టు పెట్టి, వచ్చిన డబ్బులో కొంత కమీషన్ తీసుకొని మిగతా మొత్తాన్ని క్యాషియర్ రవీందర్‌కు బదిలీ చేస్తున్నారు. ఇప్పటి వరకు నిందితులు 10 ప్రైవేట్ గోల్డ్ లోన్ లెడింగ్ కంపెనీలైన ఎస్‌బీఎఫ్‌సీ, ఇండె ల్ మనీ, ముత్తూట్ ఫైనాన్స్, గోదావరి అర్బ న్, మణిపురం, ముత్తూట్ ఫైనాన్స్ కార్పొరేషన్లలో 44 మంది పేర్లపై 142 గోల్డ్ లోన్లు తీసుకున్నారు. ఇదేగాక రవీందర్ మరో మోసానికి తెరలేపాడు.

బ్రాంచ్ మేనేజర్‌తో కుమ్మక్కై అతని భార్య, బావమరిది, స్నేహితుల పేరిట 1.58 కోట్ల విలువైన 42 తప్పుడు గోల్డ్ లోన్లు తీశాడు. ఆభరణాలు డిపాజిట్ చేయకుండానే 4.4 కిలోలు తాకట్టు పెట్టినట్లు చూపించి డబ్బులు విత్‌డ్రా చేశాడు. ఇంకా ఏటీఎంలలో నగదు రీఫిల్ చేసే టైంలోనూ రవీందర్ డబ్బు అపహరించినట్లు తమ విచారణలో తేలిందని సీపీ చెప్పారు. ఈ కేసులో ముగ్గురు బ్యాంకు ఉద్యోగులతోపాటు వారికి సహకరించిన 41 మందిని అరెస్ట్ చేశామని, తాకట్టు పెట్టిన అభరణాలు 15.23 కిలోలు రికవరీ చేసినట్లు వివరించారు. మిగితా ఆభరణాలను రికవరీ చేస్తామన్నారు. ఈ కేసులో గోల్డ్ లోన్ కంపెనీ మేనేజర్‌ల పాత్రపై విచారణ జరుగుతుందన్నారు.

**అరెస్టయింది వీరే..**

అరెస్టయిన వారిలో జైపూర్ మండలం శెట్టిపల్లికి చెందిన క్యాషియర్ నరిగే రవీందర్, బ్యాంకు మేనేజర్ వెన్నపు మనోహర్, అవుట్‌సోర్సింగ్ అటెండర్ లక్కాకుల సందీప్, మంచిర్యాల ఎస్‌బీఎఫ్‌సీ గోల్డ్ లోన్ ఫైనాన్స్ సేల్స్ మేనేజర్ కొంగొండి బీరేశ్, కస్టమర్ రిలేషన్ మేనేజర్ కోదాటి రాజశేఖర్, సేల్స్ ఆఫీసర్ బొల్లి కిషన్‌కుమార్, జైపూర్ మండలం శెట్టిపల్లికి చెందిన ఫొటోగ్రాఫర్ ఉమ్మాల సురేశ్, మంచిర్యాల జిల్లా రాళ్లపేటకు చెందిన నడిగొట్టి సాగర్, రామకృష్ణాపూర్‌కు చెందిన రాంశెట్టి చంద్రబాబు, భరతపు రాకేశ్, కడం రమేశ్, మంచిర్యాలలోని లక్ష్మీనగర్‌కు చెందిన దిగుట్ల సునీల్, బృందావన్ కాలనీకి చెందిన దారపు నాగరాజు ఉన్నారు.

**పోలీసులకు అభినందనలు..**

ఈ కేసు బహిర్గతమయ్యేందుకు ప్రత్యేక కృషి చేసిన డీసీపీ భాస్కర్, ఏసీపీ వెంకటేశ్వర్, చెన్నూర్ సీఐ దేవేందర్‌రావు, రూరల్ సీఐ బ న్సీలాల్, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, మం చిర్యాల రూరల్ సీఐ అశో క్, డబ్ల్యూపీఎస్ ఇన్‌స్పెక్టర్ నరేశ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ బాబురావు, ఎస్ఐలు సుబ్బారావు, శ్రీధర్, రాజేందర్, శ్వేత, సంతోశ్, ల క్ష్మీప్రసన్న, కో టేశ్వర్, ఉపేందర్‌రావు, చంద్రశేఖర్, రవి, సి బ్బంది శంకర్, రవి, రమేశ్, ప్రతాప్, తిరుప తి, లింగమూర్తిని అధికారులు అభినందించారు.







## సుదూర నయనాల కన్నీటి చూపు




**ముథోల్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)** దూర భావ పరిస్థితులలో తమ చిన్నాన్న అంత్యక్రియలకు హాజరు కాలేకపోయిన కూతురు కడసారి కనుచూపును చరవాణి వీడియోకాల్లో చూసి, రోధించిన ఘటన నిర్మల్ కేంద్రంలో చోటు చేసుకుంది. బాగువాడ కేంద్రంలో అనారోగ్యంతో మరణించిన తన బాబాయి అంత్యక్రియలకు హాజరు కాలేకపోయిన కూతురు, చరవాణిలో చివరి చూపు చూస్తూ, బాబాయ్ వి మిస్ యూ అంటూ రోదిస్తున్న సంఘటన..!అంత్య క్రియల వేళ అందరికి కంటతడి పెట్టించింది. అంత్యక్రియలకు హాజరు కాలేక పోయినా అక్కడి ప్రతి కార్యక్రమాన్ని చరవాణిలో తిలకించింది. ప్రత్యక్షంగా లేకపోయిన పరోక్షంగా ఇలా చరవాణిలో అంత్యక్రియలకు హాజరైన విధానంను చూసిన పలువురు ఫోన్ వాడకం లేని అప్పటి రోజులను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో ఇలాంటి అవకాశాలు లేక చివరి చూపు నోచుకోలేకపోయే వాళ్ళం అని గుర్తుచేసుకున్నారు.

## నిండు ప్రాణం తీసిన ఈత సరదా

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. ఆసిఫాబాద్ పెద్దవాగులో స్నానానికి వెళ్లిన ముగ్గురు ప్రమాదవశాత్తు గల్లంతు అయ్యారు. వివరాల్లోకి వెళితే ఆసిఫాబాద్ పట్టణానికి అయాన్, రియాన్ లతో సమీప బంధువైన జైనూర్ మండలంలోని పాట్నాపూర్ కు చెందిన షేక్ మహబూబ్‌లు సరదాగా మధ్యాహ్నం ఆసిఫాబాద్ పెద్దవాగుకు సాన్నానికి అని వెళ్లారు. ఇదే క్రమంలో షేక్ మహబూబ్ వాగులో స్నానానికి దిగి నీటమునుగుతుండగా ఒడ్డున ఉన్న అయాన్, రియాన్ లు చూసి అతన్ని కాపాడేందుకు వాగులో దిగారు. అక్కడ స్థానికంగా ఉన్న ఓ ట్రాక్టర్ డ్రైవర్ గమనించి సాహసం చేసి అయాన్, రియాన్ లను ఇద్దరిని కాపాడాడు. షేక్ మహబూబ్ మాత్రం అప్పటికే



వాగులో గల్లంతయ్యాడు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకుని షేక్ మహబూబ్ కోసం ఈతగాళ్లతో గంట సేపు శ్రమించి మహబూబ్ మృతదేహాన్ని వెలికితీశారు. మహబూబ్ మృతితో కుటుంబం శోకసముద్రంలో మునిగారు.



## బీసీ రిజర్వేషన్ కు కాంగ్రెస్ కట్టుబడి ఉంది..



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)** బీసీ రిజర్వేషన్ కు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని డీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుగుణ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. బీసీలు రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలనే ముఖ్య ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీ తీర్మానం చేయడం హర్షణీయమన్నారు. బీఆర్ఎస్, బీజేపీకి బీసీ రిజర్వేషన్ పై చిత్తశుద్ధి లేదని చెప్పుకొచ్చారు. బీసీ రిజర్వేషన్ బిల్లును గవర్నర్, రాష్ట్రపతి వద్ద పంపితే కనీసం పట్టించుకోవడంలేదని ఆమె ఆరోపించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనం పై సమీక్ష




**ఆదిలాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**

వినాయక చవితి ఉత్సవ శాంతియుత కమిటి సమావేశం వినాయక నిమజ్జనం పై పీస్ కమిటి సభ్యులు, సంబంధిత జిల్లా అధికారులతో సోమవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ లు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ లు మాట్లాడుతూ ఈ నెల 4, 6 తేదీలలో 9వ రోజు, 11వ రోజు నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా సంబంధిత శాఖలన్నీ సమగ్ర సమన్వయంతో ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులు ఆదేశించారు. బాధ్యతాయుత ఏర్పాట్లు నిమజ్జన కార్యక్రమంలో ఎక్కడా అవాంచనీయ సంఘటనలు జరగకుండా, పూర్తి జాగ్రత్తలు, భద్రతా చర్యలు, అవసరమైన ఏర్పాట్లు పాటించాలని సూచించారు. కార్యక్రమం పూర్తయ్యేంతవరకూ అధికారులంతా హై అలర్ట్ లో ఉండాలని తెలిపారు. మున్సిపల్, పంచాయితీ, %=ఆదీ%, ఎక్సైజ్, విద్యుత్ శాఖలు %-% సంబంధిత మరమ్మత్తు పనులు, రహదారులపై గుంతలు పూడ్చడం, వాటర్ , విద్యుత్ సదుపాయాలు పర్యవేక్షించడం., మండపాల వద్ద ప్రత్యేక శ్రద్ధ, శుభ్రత, భద్రతా చర్యలపై కంట్రోల్. ఏర్పాట్లు పకడ్బందీగా ఏర్పాటు చేయాలని అన్నారు. ఎక్సైజ్ శాఖ 9 వ, 11వ రోజులలో బెల్ట్ షాపులు పూర్తిగా మూసివేయాలని ఎక్కడా కూడా బెల్ట్ షాపులు తెరవకుండా, ఎక్సైజ్ అధికారులు పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లు క్రేన్లు, గజ ఈతగాళ్ళు, అవసరమైతే %బీజజ% టీమ్, అపర్ మిత్ర టీమ్ లను రంగంలోకి దించేందుకు సిద్ధంగా ఉంచాలని సూచించారు. క్రేన్ ఆపరేటర్లకు ముందుగానే హెల్త్ చెకప్ చేయించాలని, వారి లిస్టును అధికారులకు సమర్పించాలని, షిఫ్ట్ వారీగా ఆర్డర్లు జారీ చేయాలని తెలిపారు. ఆల్టర్నేట్ డ్రైవర్లను కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు.

మొబైల్ టీమ్ చర్యలు: అన్ని మండపాల వద్ద మొబైల్ టీమ్ తిరుగుతూ పర్యవేక్షణ జరుపుతుందని తెలిపారు. ప్రత్యేకించి జిల్లా ప్రజలు, భక్తులు శాంతియుతంగా సహకరించాలని, అధికారులతో కలిసి సహకరించాలని కోరారు. అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో సమన్వయం తో పనిచేసి ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం ప్రక్రియ విజయవంతం చేయాలనీ అన్నారు. ఈ సందర్భంగా , ఉత్సవాల నిర్వహణకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని, రోడ్ల మరమ్మతులు, శోభాయాత్రకు అడ్డంకిగా ఉండే చెట్ల కొమ్మలను తొలగించడం జరుగుతుందని, భద్రతాపరమైన చర్యలకు జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందనీ అన్నారు. వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు విగ్రహాలు నిమజ్జనం చేసే ప్రక్రియను ఆద్యంతం అధికారులు పర్యవేక్షణ జరపాలని, గజ ఈతగాళ్ల ను అందుబాటులో ఉంచుతూ క్రేన్, లైటింగ్ వ్యవస్థ, అత్యవసర వైద్యం, అంబులెన్స్, తాగునీరు, బారికేడ్స్ , ట్రాఫిక్ క్రమబద్దీకరణ, టాయిలెట్స్, పారిశుధ్యం వంటి చర్యలు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో శోభాయాత్రలో పాల్గొనే వాహనాల్లో ఎటువంటి యాంత్రిక సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని, నిమజ్జన యాత్ర కొనసాగే ప్రాంతాలలో రోడ్లకు ఇరువైపులా కిందికి వేలాడే కరెంటు తీగలు, వంగి ఉన్న చెట్ల కొమ్మలు వంటివి ఏవైనా అడ్డంకులు ఉంటే వాటిని తొలగించాలని, ప్యాచ్ వర్క్ చేపట్టి రోడ్లపై ఏర్పడిన గుంతలను మూసివేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చెరువులు, పరీవాహక ప్రాంతాల వద్ద సరిపడా సంఖ్యలో క్రేన్ లను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గణేష్ ఉత్సవాలు సందర్భంగా మద్యం విక్రయాలు జరుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు. ప్రజలు ఎలాంటి అపోహలు, వదంతులను నమ్మకూడదని, ఎక్కడైనా ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే పోలీసుల దృష్టికి తేవాలని, ప్రతి ఒక్కరు సంయమనం పాటిస్తూ ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని ఎస్పీ సూచించారు. గణేష్ వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు అందరి సమన్వయం తో విజయవంతం చేయాలని , ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో, డీఎస్పీ జీవన్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ సలోని, %తీఎశీ% స్రవంతి, జిల్లా అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని, ప్రజల ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ప్రతి ప్రజావాణి దరఖాస్తును పరిశీలించి తక్షణమే పరిష్కరించాలన్నారు., మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించాలి అని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి అనంతరం కలెక్టర్ సమీక్షిస్తూ, అధికారులు వరద సమయంలో తీసుకున్న తగు చర్యలను ప్రశంసిస్తూ, ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అదనంగా, వరద నష్ట నివేదికలు సిద్ధం చేయడం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచడం, ప్రధానమంత్రి ఆవాస్ యోజనకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక సర్వేను త్వరితగతిన పూర్తి చేయడం, వనమహోత్సవంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయడం, ప్రభుత్వ బడులను ఎప్పటికప్పుడు పరిశీలించి తక్షణ చర్యలు ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





## ఉద్యోగ, ఉపాధ్యాయుల హామీలను అమలు చేయాలి

**- కలెక్టరేట్ ఎదుట ఉద్యోగుల నిరసన - సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్**



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**

ఎన్నికల సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ జిల్లా అధ్యక్షుడు సంద అశోక్ అన్నారు. సీపీఎస్ రద్దు చేయాలనే డిమాండ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం విద్రోహ దినంగా పాటిస్తు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. స్థానిక టీఎన్జీవోస్ భవనం నుంచి నల్ల బ్యాడ్జీలు ధరించి చేపట్టిన ర్యాలీ ఎన్టీఆర్ చౌక్, కుమురం భీం చౌక్ మీదుగా కలెక్టరేట్ కు చేరుకున్నారు. కలెక్టర్ కార్యాలయ ప్రధాన గేటు ఎదుట ధర్నా నిర్వహించి ఓపీఎస్ ను పునరుద్దరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు అశోక్ మాట్లాడుతూ 2024 సెప్టెంబర్ 1న సీపీఎస్ ను అమలు చేస్తు ఉత్తర్వులు వచ్చాయన్నారు. రోజును ఉద్యోగ ఉపాధ్యాయులు విద్రోహ దినంగా పాటిస్తున్నారని తెలిపారు. ఎన్నికల హామీ మేరకు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు జేఏసీ ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళనలు చేపడుతామన్నారు. జేఏసీ సెక్రటరీ జనరల్ శివకుమార్ మాట్లాడుతూ సిపిఎస్ అనేది ఉద్యోగుల భవిష్యత్తును దెబ్బతీస్తోందని జీవన భద్రతకు హాని కలిగిస్తోందని అన్నారు. వృద్ధాప్యంలో కనీస భరోసా కలిగించే పాత పెన్షన్ విధానమే శాశ్వత పరిష్కారం అని తెలిపారు. పలువురు జెఏసి నాయకులు మాట్లాడుతూ సిపిఎస్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ వర్షాకాల సమావేశాల్లోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని లేనిపక్షంలో లక్షలాది మంది తరలివచ్చి హైదరాబాద్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ లోని ప్రజావాణిలో కలెక్టర్ రాజర్షి షా ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసి నాయకులు కే.కిష్టన్న, ఎ.నవీన్ కుమార్, మూగ శ్రీనివాస్, సోగల సుదర్శన్, మోతే శ్రీనివాస్, పన్నాల సంజీవరెడ్డి, బి.ప్రవీణ్ కుమార్, ప్రవీణ్ కుమార్, జలంధర్ రెడ్డి, ఆడే నూర్సింగ్, కాంబ్లే విజయ్ కుమార్, తిరుమల రెడ్డి, బెజ్జంకి రవీంద్ర, పుప్పాల నరేందర్, అశోక్, కార్యదర్శి, దిలీప్, లక్ష్మారెడ్డి ,రాజేందర్ దేశ్పాండే, సఫ్దర్ అలీ, నర్సింలు, నర్సిములు, రమేష్ పాల్గొన్నారు.

## గిరిజనుల సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి

**ఉట్నూర్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**



గిరిజనుల దరఖాస్తులను పరిష్కరిస్తుంచడంలో అధికారుల సమన్వయంతో ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పరిపాలన అధికారి దామోదర్ స్వామి అన్నారు. సోమవారం సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఉట్నూరు మండలం శాంతినగర్ గ్రామానికి చెందిన గోడం విజయ తనకి ఏదైనా ఆశ్రమ పాఠశాలలో వర్కర్ గా నియమించమని అర్జి,మామడ మండలం రామదారి తండా గ్రామానికి చెందిన గంగ్లావత్ అమృత ఆర్. ఓ. ఎఫ్. ఆర్. పట్టా ఇప్పించాలని, తలమడుగు మండలం అర్లి (కే)గ్రామానికి చెందిన నారు బుమ్మన్న తన వ్యవసాయం లో బోర్ వెల్ మంజూరు చేయమని, ఇంద్రవెల్లి మండలం హర్కపూర్ గ్రామానికి చెందిన లలిత తనకి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కోరడంతో పాటు పింఛన్, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన వివిధ రకాల సమస్యలను పరిష్కరించాలని దరఖాస్తుదారులు అర్జీ లు సమర్పించారు. ఈ సందర్భంగా ఎ. ఓ. మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ. పి. ఓ. (పి వి టి జి) మెస్రం మనోహర్, పి. హెచ్. ఓ. సందీప్ కుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ మహిళల కై షీ టీం బృందం

- మహిళల భద్రత సురక్షత ముఖ్యం
- ఆకతాయిల వేధింపుల పై ప్రత్యేక దృష్టి సారింపు.
- గణపతి నవరాత్రి ఉత్సవాలలో ప్రత్యేక పాత్ర పోషిస్తున్న షీ టీం బృందం.
- మహిళలను వేధించిన, మహిళల సమస్యల కై అందుబాటులో ఆదిలాబాద్ షీ టీం
- 27 అవగాహన కార్యక్రమాల నిర్వహణ
- గత నెలలో 135 సార్లు హాట్స్పాట్ ల తనిఖీ.
- 3 ఎఫ్ఐఆర్ ల నమోదు, 18 ఈ పెట్టి కేసుల నమోదు
-1 కౌన్సిలింగ్ నిర్వహించి సమస్య పరిష్కారం.
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్





**ఆదిలాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)** మహిళల భద్రతకై రక్షణకై ఆదిలాబాద్ జిల్లా షీ టీం బృందం అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తూ ప్రజల రక్షణకై విధులను నిర్వర్తిస్తుందని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలియజేశారు. సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాలలో రాత్రి సమయాలలో ఆకతాయిలు అల్లరి చేస్తూ మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. షీ టీం బృందం ప్రత్యేకంగా రాత్రి సమయాలలో రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాలలో సంచరిస్తూ మహిళలను వేధిస్తున్న వారిపై దృష్టి సారించిందని తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా ఆదిలాబాద్ షీ టీం బృందాలు యువతులకు, విద్యార్థిని విద్యార్థులకు, పని స్థలాలలో మహిళలకు ప్రత్యేకంగా 27 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చైతన్య పరచడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఏప్రిల్ నెలలో షీ టీం బృందాల ద్వారా 3 ఎఫ్ఐఆర్ కేసులు, 18 ఈ పెట్టీ కేసుల నమోదు చేయడం జరిగిందని తెలిపారు. షీ టీం బృందాలు నెల రోజులలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 42 హాట్స్పాట్లలో 135 సార్లు తనిఖీ చేయడం జరిగింది, పలు గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఆదిలాబాద్ షీ టీం బృంద సభ్యులు చాకచక్యంగా ఉంటూ ఇతర జిల్లాల వారిని సైతం పట్టుకుంటూ తమకంటూ ప్రత్యేక స్థానాన్ని జిల్లాలో నెలకొల్పుతున్నారు. వివిధ ప్రదేశాలలో ఉండి మహిళలను వేధిస్తున్న వారిని ఆదిలాబాద్ కి రప్పించి కేసులను నమోదు చేయడం జరిగిందని తెలిపారు. రెడ్ హ్యాండెడ్గా ఒకరిని పట్టుకొని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. కౌన్సిలింగ్ ద్వారా ఒక కేసులో పరిష్కారం చూపబడింది అని తెలిపారు. ఆపత్కాల సమయంలో ఆదిలాబాద్ షి టీం బృందాల ను సంప్రదించాలంటే 8712659953 నంబర్కు ఫోన్ ద్వారా సంప్రదించాలన్నారు. ఆరు కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించి కుటుంబ కలహాలను మహిళల పట్ల జరిగే కలహాలను పరిష్కరించడం జరిగిందని తెలియజేశారు. అవగాహన కార్యక్రమాలలో చైల్డ్ మ్యారేజ్, గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ లపై, ప్రస్తుతం మహిళల పట్ల జరుగు సైబర్ నేరాల పై, సోషల్ మీడియాలలో జరుగు నేరాలపై అవగాహన కల్పిస్తూ యువతను చైతన్య పరచడం జరుగుతుందని తెలిపారు.



## సింగరేణి డైరెక్టర్ ఈ అండ్ ఎంగా మోకాళ్ల తిరుమలరావు బాధ్యతల స్వీకరణ

**- అభినందనలు తెలిపిన సింగరేణి సంస్థ సి అండ్ ఏండి ఎన్ బలరామ్**



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)** సింగరేణి సంస్థలో ఈ అండ్ ఎం డైరెక్టర్ గా నియమితులైన మోకాళ్ల తిరుమలరావు సోమవారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ముందుగా ఆయన సంస్థ సి అండ్ ఎం ఎన్.బలరామ్ ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా సి అండ్ ఎండి ఎన్.బలరామ్ మాట్లాడుతూ.. సంస్థలో ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదలలో ఈ శాఖ ఎంతో కీలకమైన పాత్ర కలిగి ఉందని, ఈ బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తూ పూర్తి పని గంటలు యంత్రాలు అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో సింగరేణి వ్యాపార విస్తరణ చర్యలలో భాగంగా పెద్ద ఎత్తున సోలార్, థర్మల్ ప్రాజెక్టులతోపాటు ఇతర రంగాల్లోకి విస్తరిస్తోందని, ఈ ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేయడంలో ముఖ్య పాత్ర పోషించాలన్నారు. తనపై నమ్మకం ఉంచి సంస్థలో ఉన్నత స్థానానికి ఎంపిక చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి మోకాళ్ల తిరుమలరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సంస్థ లక్ష్యాలకు కట్టుబడి ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదలకు తమ శాఖ సమర్థంగా పనిచేసేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. 136 ఏళ్ల సింగరేణి చరిత్రలో తొలిసారిగా గిరిజనుల్లోని కోయ తెగ కు చెందిన అధికారికి డైరెక్టర్ బాధ్యతలు అప్పగించడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

## బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు పట్ల కాంగ్రెస్ సంబరాలు



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)** అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఏకగ్రీవ ఆమోదం పట్ల జిల్లా కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఏఐసీసీ టీపీసీసీ ఆదేశాల మేరకు సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాసేవ భవన్ నుంచి సోమవారం ర్యాలీ నిర్వహించారు. రేవంత్ రెడ్డికి ప్రభుత్వానికి మద్దతుగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. బీసీ నేతలందరు ప్రభుత్వానికి సీయం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ ప్రముఖుల ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. బిల్లు ఏకగ్రీవ ఆమోదం పొందడం పట్ల బీసీ లందరూ ఎంతో గర్విస్తున్నారని అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇది చారిత్రాత్మక నిర్ణయం అన్నారు.. ఒక ఓసి ముఖ్యమంత్రి అయి ఉండి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయటాన్ని ఆయన స్వాగతించారు. ఇది బీసీ లందరికీ గర్వకారణం అన్నారు. స్పెషల్ ఆర్డినెన్స్ ద్వారా ఖచ్చితంగా స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలై తీరుతుందన్నారు. ఆరు నూరైనా బీసీ బిడ్డలందరికీ న్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు సరైన న్యాయం చేసిందన్నారు .42 శాతం రిజర్వేషన్ తో సత్కరించిందన్నారు. ఈ బిల్లు పట్ల కేవలం బీసీలు మాత్రమే కాకుండా ప్రజలందరూ కూడా హర్షిస్తున్నారన్నారు. బిజెపి బీఆర్ఎస్ లు బీసీలను కేవలం ఓటు బ్యాంకు గానే చూశాయని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వాళ్లకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి సరైన న్యాయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## బీసీల రిజర్వేషన్ చారిత్రాత్మక నిర్ణయం..



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)** అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఏకగ్రీవ ఆమోదం పట్ల జిల్లా కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాసేవ భవన్ నుంచి సోమవారం పెద్ద ఎత్తున హాజరైన కాంగ్రెస్ శ్రేణులతో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి మద్దతుగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, కాంగ్రెస్ ప్రముఖుల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. బిల్లు ఏకగ్రీవ ఆమోదం పొందడం పట్ల బీసీ లందరూ ఎంతో గర్విస్తున్నారని అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇది చారిత్రాత్మక నిర్ణయమన్నారు. స్పెషల్ ఆర్డినెన్స్ ద్వారా కచ్చితంగా స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలై తీరుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు సరైన న్యాయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జహీర్ రంజాని, రూపేష్ రెడ్డి, రామ్ కుమార్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరద నష్టాలపై స్పష్టమైన నివేదిక రూపొందించాలి

**- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**





**మంచిర్యాల, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)** రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఏర్పడిన వరద నష్టాలపై స్పష్టమైన నివేదిక రూపొందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్రావు, ధనసరి అనసూయ (సీతక్క), రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సబ్-కలెక్టర్లు, పోలీసు శాఖ అధికారులు, ఇతర శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా ప్రాణ నష్టం, పశు నష్టం, ఆస్తి నష్టం, పంట నష్టం సంభవించాయని, రహదారులు కొట్టుకుపోవడం, చెరువులకు గండి పడటం, జాతీయ రహదారులు కోతకు గురవడం జరిగాయని, ఈ నష్టాలకు సంబంధించి స్పష్టమైన వివరాలతో నివేదిక రూపొందించాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 22 మంది మరణించారని తెలిపారు. అన్ని శాఖలు కలుపుకొని ప్రాథమిక అంచనా నష్టం 4 వేల 124 కోట్ల రూపాయలుగా ఉందని, కేంద్ర ప్రభుత్వం నుండి ప్రకృతి విపత్తుల నిధులు వచ్చే విధంగా అన్ని జిల్లాల నివేదికలను క్రోడీకరించి రాష్ట్ర స్థాయి నివేదిక రూపొందించాలని తెలిపారు. నీటి పారుదల, వ్యవసాయం, విద్యుత్, రోడ్లు-భవనాలు, వైద్య-ఆరోగ్య-కుటుంబ సంక్షేమం, మున్సిపల్ ఇతర అన్ని శాఖల వారిగా నష్టాలపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి నష్టాలకు సంబంధించి ప్రకృతి విపత్తుల పరిధిలోకి వచ్చే వివరాలతో నివేదిక తయారు చేయాలని తెలిపారు. మిషన్ భగీరథ పథకం పరిధిలో పైపైన్ల ధ్వంసానికి దాదాపు 9 కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని తెలిపారు. విద్యుత్, రోడ్లు-భవనాలు శాఖల పరిధిలో చేపట్టిన తక్షణ చర్యలకు సంబంధించి పనుల వివరాలు సమర్పించాలని తెలిపారు. 23 మున్సిపాలిటీల పరిధిలో ముఖ్యంగా కామారెడ్డి, మెదక్ లలో 88 కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలో వీధి దీపాలు, అమృత్ పథకం సంబంధించి సంబంధిత అధికారులు సమీక్షించి నివేదిక అందించాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య, నర్సింగ్ కళాశాలల నిర్మాణాలకు సంబంధించి వివరాలు సమర్పించాలని తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రకృతి విపత్తులపై తక్షణమే స్పందించి ప్రజా రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరదల కారణంగా సంభవించిన ప్రాణ నష్టం, పశు నష్టం, ఇండ్ల నష్టాలకు సంబంధించి జి.ఓ. నం.19 ప్రకారం నివేదిక స్పష్టంగా రూపొందించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అన్ని శాఖల అధికారులు జిల్లాలోని అన్ని లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి జరిగిన నష్టంపై పూర్తి వివరాలతో నివేదిక రూపొందించాలని తెలిపారు. దెబ్బతిన్న రహదారులు, గండి పడిన చెరువులు, ప్రాణ నష్టం, పశు నష్టం, పంట నష్టం, విద్యుత్ ఇతర అన్నింటిని పరిశీలించాలని, ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా నష్టం వివరాలతో పాటు బాధితుల వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి. ఎ. భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, అన్ని శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.త

# సిపీఎస్ రద్దు చేయాలని కలెక్టర్ ఎదుట నిరసన



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)** సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ ఇవ్వాలని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీని ఇచ్చిన వాగ్దానం ప్రకారం నెరవేర్చి సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేస్తున్న రాష్ట్రంగా అమలు చేసిన ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలవాలని కోరుతూ టిజిఇజెఎసి కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ముందు నిరసన చేస్తూ ధర్నా చేపట్టడం జరిగినది. అనంతరం అదనపు కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టిజిఈజెఎసి చైర్మన్ ఎల్ .రాజశేఖర్, సెక్రటరీ జనరల్ అహ్మద్ ఒమర్ హుస్సేన్, కో చైర్మెన్లు శాంతి కుమారి, అబ్దుల్ ఖమర్, పోషన్న, తుకారాం, శశిధర్, తోటాజి, నవీన్ రెడ్డి, జయదేవ్ అబ్రహం, మినహాజ్, అలీ, కరుణాకర్ గౌడ్, అఖిల్ కృష్ణ మరియు వైస్ చైర్మన్ లు ఉషన్న, మాణిక్రావు,సదాశివ్ , రియాజ్ అలీ మరియు నాయకులు, తది తరులు పాల్గొన్నారు

# ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

**- వరద బాధితులను ఆదుకోవాలి: మాజీ ఎంపీ వెంకటేష్ నేత**




**మంచిర్యాల, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయిందని మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత విమర్శించారు. సోమవారం మంచిర్యాల ఐబీ చౌరస్తా నుంచి నస్పూర్ లోని జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్రగా తరలివచ్చి కలెక్టరేట్ ముందు వరద బాధితులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు రఘునాథ్ వెరబెల్లితో కలిసి మాట్లాడారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని, ఎన్టీఆర్ నగర్ నీట మునిగిన ఇండ్ల వరద బాధితులకు నష్టం పరిహారం, వరదతో పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో అమలుకు నోచుకోని అనేక హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. వరదలతో ఎన్టీఆర్ నగర్ ప్రజలు, రైతులు నష్టపోతే ఇప్పటి వరకు ప్రభుత్వం బాధితులను ఆదుకోలేదన్నారు. ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళు ఇస్తామని చెప్పి కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నారని విమర్శించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ని కలిసి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, వరద బాధితులకు నష్ట పరిహారం అందించాలని వినతి పత్రం అందజేశారు.

# జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)** జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, సామాజిక, ప్రాథమిక, ఉప ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ ఇన్చార్జ్ అధికారిగా డా? ఎస్.అనిత బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సోమవారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో జిల్లా కలెక్టర్కు కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రోగ్రామ్ అధికారులు ప్రతి రోజు తమ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలను సందర్శించి నివేదిక అందించాలని, జ్వర బాధితులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య చికిత్సలు అందించాలని, జ్వర సంబంధిత మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. మలేరియా, డెంగ్యూ విషజ్వరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, వ్యాధుల ప్రబలకుండా పాటించవలసిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, దోమల వృద్ధిని అరికట్టేందుకు చేపట్టవలసిన చర్యలపై సంబంధిత శాఖల సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థుల సంక్షేమం కోసం సకాలంలో వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన పరీక్షలు నిర్వహించి మందులు అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. టి.బి. నియంత్రణపై సమీక్ష నిర్వహించి నివేదిక అందించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, డా? ప్రసాద్, డా? కృపాబాయి, డా? అనిల్, ప్రోగ్రామ్ అధికారులు, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్ టాస్క్ ఆఫీసులో టెక్నికల్ కోర్సులకు శిక్షణ

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని టాస్క్ ఆఫీసులో జావా, పైథాన్, వెబ్ డెవలప్మెంట్, డేటాబేస్, సూడోకోడ్, %జ, జంం, ఌమీూ, జుూ%, జావా స్క్రిప్ట్, ఆప్టిట్యూడ్ రీజనింగ్, సాఫ్ట్ స్కిల్స్ వంటి ప్రముఖ టెక్నికల్ కోర్సులకు శిక్షణ అందిస్తున్నారు. ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన ఆసక్తిగల అభ్యర్థులు సెప్టెంబర్ 1, 2, 3 తేదీలలో ఆసిఫాబాద్ టాస్క్ ఆఫీసులో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రాకేష్ (7989733351) ను సంప్రదించవచ్చు.

## ఏరియాలో 36% బొగ్గు ఉత్పత్తి



**మందమర్రి, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
ఏరియాలో ఆగస్టు మాసానికి గాను నిర్దేశించిన లక్ష్యంలో 36% బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఏరియా సింగరేణి ఇంచార్జి జనరల్ మేనేజర్ విజయ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఏరియాలోని జిఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెలలో కురిసిన వర్షాల మూలంగా బొగ్గు ఉత్పత్తి పూర్తిగా తగ్గిపోయిందని, దీనికి తోడు భూగర్భ గనుల్లో కార్మికుల గైర్హాజర్ మూలంగా ఆశించిన బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలుగుతుందని, దీనిపై యూనియన్ నాయకులతో చర్చించి గైర్హాజర్ తగ్గించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు, అధికారులు, యూనియన్ నాయకుల సహాయ సహకారాలతో భూగర్భ గనులలో 100% బొగ్గు ఉత్పతి సాధించడానికి కృషి చేస్తున్నట్టు వివరించారు. రానున్న రోజుల్లో ఏరియాలో బొగ్గు ఉత్పత్తి మెరుగుపరిచి లక్షాలను సాధించేలా తగిన ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందని ఉత్పత్తి, ఉత్పాదకత పెంచేందుకు కార్మికులు అధికారులు కార్మిక సంఘాల నాయకులు సహకరించి బొగ్గు ఉత్పత్తిని పెంచేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఇన్చార్జ్ పర్సనల్ మేనేజర్ ఎండి ఆసిఫ్, ఐఈడి, ఎస్ఈ కిరణ్ కుమార్, సీనియర్ పిఓ శంకర్ పాల్గొన్నారు.

## లబీసీలకు 42% రిజర్వేషన్లు చారిత్రక నిర్ణయం

**- టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క**

**- జైనూర్‌లో బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ సంబరాలు**



**జైనూర్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందినందుకు హర్షం వ్యక్తం చేస్తూ జైనూర్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీ కార్యకర్తలు బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని సుగుణక్క స్వాగతించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీల కృషిని తెలంగాణ సమాజం గుర్తించాలని కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర మంత్రివర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్,మండల ప్రెసిడెంట్ ముఖిత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కోప్షన్ మెంబెర్ అఫ్రోజ్ ఖాన్ మాజీ ఎంపీటీసీ అజ్జు లాల వసీమ్ హైదర్ దావత్ రావ్ గంగారాం గోపీచంద్ సేకు రహీం కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక సత్యనారాయణ వ్రతాలు

**నిర్మల్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గణేష్ నవరాత్రి ఉత్సవంలో భాగంగా సోమవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించారు. ఇక్కడ కర్ర వినాయకుని ప్రతిష్టింపజేసి గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

# అప్పుడే మంచిగా ఉండే కార్యక్రమానికి జన నీరాజనం

**- ప్రజల్లోకి బీఆర్ఎస్ అభివృద్ధి, కాంగ్రెస్ వైఫల్యాలు - బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్**



**మందమర్రి, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
అప్పుడే మంచిగా ఉండే, మా గ్రామం నుంచి పోరాటం అంటూ బీఆర్ఎస్ పార్టీ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా ప్రజలు స్వాగతిస్తూ నీరాజనాలు పలుకుతున్నారని జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ స్పష్టం చేశారు. సోమవారం పట్టణంలోని పాత బస్టాండ్‌లో అప్పుడే మంచిగా ఉండే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంతో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు పోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలలో భాగంగా జిల్లాలో పైలేట్ ప్రాజెక్టుగా ఎంపికైన పట్టణంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి ప్రజల నుండి సమస్యలను, అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ స్వయంగా మొదటి ఫిర్యాదును నమోదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధికై స్థానిక సంస్థల ఎన్నికల వేళ, గ్రామాల నుంచే మరల పోరాటం ప్రారంభించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఏళ్ల తరబడి సంపాదించుకున్న అభివృద్ధి, సంక్షేమం, ఆత్మగౌరవం ఇవన్నీ తిరిగి పొందాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి గ్రామం ఇంటి నుండి ముందుకు వచ్చే గొంతుల సమావేశమే అప్పుడే మంచిగా ఉండే కార్యక్రమం అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంతో అప్పుడే మంచిగా ఉండే అంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన రైతు బంధు, రైతు బీమా, కాళేశ్వరం ప్రాజెక్టు, కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి, 24 గంటల కరెంటు, కేసీఆర్ కిట్, కంటి వెలుగు, ఆసరా పెన్షన్ వంటి నాటి పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడం జరుగుతుందన్నారు. అదేవిధంగా 6 గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాన్ని వివరించడంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చి మరచిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లడం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ చెన్నూరు నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ రాజా రమేష్, పట్టణ అధ్యక్షుడు జే రవీందర్, టిబిజికేఎస్ ఏరియా ఉపాధ్యక్షులు మేడిపల్లి సంపత్, ఓ రాజశేఖర్, తిరుపతిరెడ్డి లతో పాటు టిఆర్ఎస్ దాని అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాలవాగుపై వంతెన నిర్మించాలి

**మందమర్రి, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
మండలంలోని శంకరపల్లి గ్రామ ప్రజల సౌకర్యార్థం కేకే 5 గని నుండి శంకరపల్లి రహదారి మధ్యలో ఉన్న పాలవాగుపై వంతెన నిర్మించాలని కోరుతూ శంకరపల్లి గ్రామస్తులు దూట తిరుపతి ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తిరుపతి మాట్లాడుతూ... కేకే 5 గని నుండి శంకర్పల్లి వరకు సుమారు మూడు కిలోమీటర్ల దూరం ఉంటుందని వర్షా కాలంలో ఈ రహదారి గుండా ప్రయాణించడం కష్టమవుతుందని, వర్షాలు కురిసి వాగులు పొంగితే ఈ దారి గుండా రవాణా పూర్తిగా నిలిచిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గ్రామస్తుల చిరకాల వాంఛ అయిన పాలవాగుపై వంతెన నిర్మించి ఇబ్బందులు తొలగించాలని కోరారు. అలాగే మండలంలోని సండ్రోన్ పల్లి నుండి శంకర్పల్లి కి వెళ్ళే రహదారి పూర్తిగా ధ్వంసం అయిందని వెంటనే బిటి రోడ్డు ఏర్పాటు చేసి గ్రామస్తులకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు.



## రోడ్డు వెడల్పు తగ్గించాలని కమిషనర్‌కు వినతి



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి పట్టణంలోని 19వ వార్డులో నూతనంగా చేపట్టనున్న రోడ్డు వెడల్పు తగ్గించాలని స్థానిక దుకాణాల వ్యాపారస్తులు, ఇళ్ల యజమానులు సోమవారం బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ కు వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ అధికారులు 60 ఫీట్లు చేపడుతామని చెబుతుండడం తమను ఆందోళనకు గురి చేస్తుందని పేర్కొన్నారు. ఈ రోడ్డు విస్తరణ వల్ల వ్యాపారులు, ఇళ్ల యజమానులు తీవ్రంగా నష్టపోయి రోడ్డు న పడే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. కాంటా నుండి పోచమ్మ గుడి వరకు 30 నుండి 40 ఫీట్ల లోపు రోడ్డు విస్తరణ చేపడితే కొంతవరకు నష్టపోయిన సహకరిస్తామని వారు పేర్కొన్నారు. 60 ఫీట్లు రోడ్డు విస్తరిస్తే బస్తీ వాసులు ఇళ్ల ను పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు బస్తీ ప్రజలు ఇళ్లతోపాటు జీవనోపాధిని కోల్పోకుండా రోడ్డు విస్తరణ చేపట్టాలని వినతిపత్రంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ ను కోరారు.

## ఆశా కార్యకర్తల ముందస్తు అరెస్ట్

**నిర్మల్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఆశా వర్కర్ల డిమాండ్ల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించి చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న ఆశా కార్యకర్తలను ముందస్తు అరెస్టులు నిర్వహించారు. నిర్మల్ భైంసా ఖానాపూర్ పేదల ప్రాంతాల్లో ఆశా వర్కర్లను ఉదయమే అదుపులో తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్లో నిర్బంధించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రకళ భాగ్య లావణ్య తదితరులు ఉన్నారు



# గణపతి నిమజ్జన కార్యక్రమాలను సరైన సమయంలో పూర్తి చేయాలి

- పట్టణంలోని పలు ప్రధాన గణపతి మండపాలను దర్శించిన జిల్లా ఎస్పీ
- నిమజ్జన ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి
- నిమజ్జనంలో డీజేలకు అనుమతి లేదు
- బొక్కలగుడ, వినాయక చౌక్, బ్రాహ్మణవాడ, తిరుపెల్లి, శివాజీ చౌక్, శాంతినగర్‌లలోని గణపతి మండపాల ను దర్శించిన జిల్లా ఎస్పీ.
- పది మండపాల సందర్శన.
- యువతతో నేరుగా మాట్లాడి సూచనలు
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్





**ఆదిలాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
గణపతి నవరాత్రి ఉత్సవాలను ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నందు ప్రశాంత వాతావరణంలో జరగడానికి యువతతో నేరుగా మాట్లాడుతూ పోలీసు ప్రజల సత్సంధాలను మెరుగుపరచడానికి జిల్లా పోలీసు యంత్రాంగం కృషి చేస్తుందని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని పలు ప్రధాన గణపతి మండపాలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా దర్శించి పూజా కార్యక్రమాల నిర్వహించి గణనాథుని సేవలో పాల్గొన్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్ పట్టణంలోని బొక్కల గూడా, వినాయక చౌక్, బ్రాహ్మణవాడ, తిరుపెల్లి, శివాజీ చౌక్, శాంతినగర్ ప్రాంతాలలోని పలు ప్రధాన గణపతి మండపాలను దర్శించి గణపతి మండప కమిటీ సభ్యులతో నేరుగా మాట్లాడి నిమజ్జనాన్ని సరైన సమయంలో పూర్తి చేయాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పట్టణంలోని జామా మజీద్ ప్రాంతాన్ని పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. దాదాపు పట్టణంలోని పది మండపాలను దర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. మండపాల వద్ద జిల్లా ఎస్పీ గారిని ఘనంగా సత్కరించిన గణపతి మండప కమిటీ సభ్యులు. మండపాలలో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిమర్జనం ఉత్సవాలలో ఎలాంటి డీజే లకు మరియు లేజర్ లైట్ లకు, పేపర్ చెల్లె యంత్రాలకు అనుమతి లేదని తెలిపారు. ఎలాంటి అత్యవసర సమయంలోనైనా డయల్ 100 ద్వారా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, ఆదిలాబాద్ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 'హంటర్' ఉంది జాగ్రత్త



**కాసిపేట, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
అటవీ ప్రాంతంలో అక్రమంగా చెట్లను నరకడం, వన్యప్రాణుల వేటగాళ్లను ఇట్టే పట్టుకునే బెల్జియం సంతతి జాగిలం హంటర్ గురించి గ్రామస్థులకు అటవి శాఖాధికారులు అవగాహన కల్పించారు. చెమట వాసనతో దొంగలను, వేటగాళ్లను పట్టేసే జాగిలమే హంటర్ అని డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్ పేర్కొన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం ముత్యంపల్లి, ధర్మారావుపేట ఫారెస్ట్ సెక్షన్‌లోని బుగ్గగూడ, చింతగూడ, వెంకటాపూర్ గ్రామాల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ సిబ్బంది బెల్జియం సంతతి జాగిలం హంటర్ గురించి, జాగిలం చేసే పనుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ ఇటీవల జన్నారం డివిజన్‌లో ఒకరు అక్రమంగా చెట్టు నరకడం చూసిన సిబ్బంది పట్టుకునే ప్రయత్నంలో అతడు పారిపోయాడని తెలిపారు. ఈ జాగిలాన్ని చెట్లు నరికిన ప్రదేశానికి తీసుకువెళ్లగా అక్కడ చెమట వాసన పసిగట్టి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ వ్యక్తి ఇంటికి తీసుకువెళ్లి నిందితుడిని పట్టించిందన్నారు. ఎవరూ కూడా చెట్లను నరకడం, వన్య ప్రాణులను వేటాడరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డాగ్ స్క్వాడ్ సిబ్బంది అనిల్ కుమార్, సెక్షన్ ఆఫీసర్ సత్యనారాయణ, బీట్ ఆఫీసర్ శ్రీధర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పిప్రి రోడ్డు సమస్యను పరిష్కరించండి

**ముథోల్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
ముథోల్ మండలంలోని పిప్రి గ్రామానికి వెళ్లే రోడ్డు సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు సోమవారం తహసిల్దార్ శ్రీలత కు వినతిపత్రం అందజేశారు. బైంసా -బాసర జాతీయ రహదారి నుండి పిప్రి గ్రామానికి వెళ్ళే రోడ్డు మధ్యలో చిన్న పాటి వర్షం తో నీళ్ళు నిల్వ ఉంటుంటంతో ఇబ్బందులు ఎదురు అవుతున్నాయని వారు పేర్కొన్నారు. నీల్వ ఉన్న నీటి ని తొలగిస్తే కొంత మంది తమను బెదిరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

# చికిత్స పొందుతూ గిరిజన యువకుడు మృతి

- వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందాడని ఆసుపత్రి ఎదుట ఆందోళన




**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సర్కార్ దవాఖానాలో జ్వరంతో ఓ గిరిజన యువకుడు సోమవారం మృతి చెందాడు. సకాలంలో వైద్యం అందించక పోవడం వల్లే మృతి చెందాడని ఆరోపిస్తూ తుడుం దెబ్బ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. ఆసిఫాబాద్ మండలం గోవింద్ పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గుడిగుడి గ్రామానికి చెందిన ఆత్రం రాంషావ్ (25) తీవ్ర జ్వరంతో బాధపడుతూ శనివారం సాయంత్రం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. రాత్రి అతని పరిస్థితి విషమించడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహించడంతోనే మృతి చెందారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆస్పత్రిలో చేర్పించిన అరగంట వరకు వైద్యసిబ్బంది ఎవరు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది సకాలంలో వైద్యం అందించి ఉంటే మృతి చెందేవాడు కాదని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు కోట్నాక విజయ్ కుమార్ సోమవారం జిల్లా ఆసుపత్రి ఎదుట నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం వలన ఇంకా ఎంత మంది చనిపోవాలని ప్రశ్నించారు. ఇప్పటికే జిల్లా ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు లేవని, పేరుకే పెద్ద ఆసుపత్రి .. ఇక్కడ ఎలాంటి సౌకర్యాలు లేవు.. కేవలం ప్రథమ చికిత్సలకే పరిమితం అవుతుందని మండిపడ్డారు.

# ఉద్యోగుల పెన్షన్ భిక్ష కాదు.. హక్కు

- జేఏసీ అధ్యక్షుడు రాజశేఖర్




**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
ఉద్యోగులకు పెన్షన్ భిక్ష కాదని అది వారి హక్కు అని ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ జిల్లా అధ్యక్షుడు లింగాల రాజశేఖర్ అన్నారు. పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ పదవి విరమణాంతరం పెన్షన్ పొందడం ఉద్యోగి హక్కు, అది ప్రభుత్వ దయాధర్మమో, భిక్షనో కాదని భారత సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుని గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రపంచ బ్యాంక్ విధానాలను అమలు చేస్తూ ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. దేశంలో పశ్చిమ బెంగాల్, త్రిపురలో పాత పెన్షన్ విధానమే కొనసాగుతుందని గుర్తు చేశారు. రాష్ట్రంలో లక్షా నలభై వేల మంది సీపీయస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వారి కుటుంబాలు సామాజిక భద్రత పట్ల ఆందోళన చెందుతూ ప్రశాంతతలేని జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాకు జిల్లా వైద్యాధికారి సీతారాం మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు శాంతి కుమారి, ఉమర్ హుస్సేన్, ఉషన్న, హేమంత్ షిండే, ఊశన్న, ఏటుకూరి శ్రీనివాసరావు, తుకారం, సదాశివ్, ఖమర్ హుస్సేన్, శ్రీపాద, వలి ఖాన్, భాగ్యలక్ష్మి కలెక్టరేట్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకులకు భయం పట్టుకుంది

**- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు**

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
అసెంబ్లీలో కాళేశ్వరం కుంభకోణంపై జరిగిన చర్చ సందర్భంగా జరిగిన విషయాలపై సోమవారం రోజు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశాంత్ రెడ్డి, కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి తాను అసెంబ్లీలో మాట్లాడిన విషయమై అవాకులు చివాకులు పేలుతున్నారని పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని పదేపదే మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు చెప్పిన సందర్భంలో స్థానిక శాసన సభ్యునిగా నీటి వనరుల మీద అవగాహన కలిగిన వ్యక్తిగా తాను జోక్యం చేసుకున్నాను తప్ప వేరే ఉద్దేశ్యం లేదని అన్నారు. అంతమాత్రన తాను కాంగ్రెస్ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్నానని అనడం హాస్యాస్పదంగా ఉన్నదని తెలియజేశారు. కాళేశ్వరం



ప్రాజెక్టుపై చర్చ సందర్భంగా తాను తుమ్మడిహెట్టికి స్థానిక శాసన సభ్యునిగా స్పీకర్ కి ఉత్తరం రాసి రెండు నిమిషాల సమయం అడిగానని అందుచేత చర్చ ముగించే దశలో తనకు స్పీకర్ అవకాశం ఇవ్వడంతో కాళేశ్వరం కుంభకోణంపై వాస్తవాలు మాట్లాడటం జరిగిందని తెలియజేశారు. కాళేశ్వరం కుంభకోణంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈఈలు మరియు డీఈలు వందల కోట్ల అక్రమ ఆస్తులు కూడబెట్టారని, అధికారుల వద్దనే ఇంత అక్రమ సొమ్ము ఉంటే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దగ్గర ఇంకెంత అక్రమ సొమ్ము ఉండాలని తాను అన్నానని గుర్తు చేశారు. సీబీఐకి ఈ కుంభకోణాన్ని అప్పగించడంతో వాస్తవాలు బయటికి వస్తాయనే ఫ్రస్టేషన్లో బిఆర్ఎస్ నాయకులు అడ్డగోలుగా మాట్లాడుతూ తనపై అభాండాలు మోపుతున్నారని అన్నారు. ఇప్పటికే చిల్లర మాటలు మాట్లాడిన బిఆర్ఎస్ అధికార పక్షం నుంచి ప్రతిపక్షానికి పడిపోయిందని ఇదే ఒరవడి కొనసాగిస్తే ప్రజలు భవిష్యత్తులో ఆ హోదా కూడా ఉండకుండా చేస్తారని హెచ్చరించారు.

# వర్షాన్ని సైతం లెక్క చేయక

**మందమర్రి, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
ఒకవైపు కుండపోతగా కురుస్తున్న వర్షం దీనికి తోడు గ్రామంలోని చెరువులు కుంటలు జలకళను సంచరించుకోగా గ్రామంలోని చెరువు పూర్తిగా నిండి నిండుకుండలా దర్శనమిచ్చింది. ఇదిలా ఉండగా చెరువు మధ్యలో వేసిన బోర్ నుండి గ్రామానికి మంచినీరు సరఫరా జరగాల్సి ఉండగా మోటార్లలో సమస్యలు తలెత్తడంతో గ్రామానికి త్రాగు నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. వర్షానికి గ్రామస్తులకు మంచినీటి ఇబ్బందులు తలెత్తకూడదని భావించి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా చెరువు పూర్తిగా మునిగినప్పటికీ గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకు ముందుకు వచ్చి బోరు మోటర్‌కు మరమ్మత్తులు చేసి గ్రామస్తుల తాగునీటి ఇబ్బందులు తొలగించారు. మామిడి గట్టుకు చెందిన కారోబార్ కిషన్, గత రాత్రి నుండి సోమవారం ఉదయం వరకు కుండపోతగా కురిసిన వర్షాలకు మండలంలోని మామిడిగట్టు గ్రామంలో మంచినీటి సరఫరా చేసే మోటార్లు పనిచేయక నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. గ్రామస్తులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కారోబార్ కిషన్ ముందుకు వచ్చి గ్రామానికి చెందిన అప్సర్ను వెంటబెట్టుకొని వర్షంకు నీటిలో మునిగిన బోరు వద్దకు వెళ్లి బోర్ కు విద్యుత్ సరఫరా అయ్యే తీగలు తెగిపోవడంతో వాటిని సరిచేసి నీటి సరఫరాను



పునరుద్ధరించారు. ఒకవైపు వర్షాన్ని మరోవైపు నిండుకుండలా ఉన్న చెరువులోని మోటర్ వద్దకు వెళ్లి బోరు మనమతులు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరింపజేసిన కిషన్, అప్సర్ ను గ్రామస్తులు అభినందించారు.

# పాలవాగుపై వంతెన నిర్మించాలి

**మందమర్రి, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
మండలంలోని శంకరపల్లి గ్రామ ప్రజల సౌకర్యార్థం కేకే 5 గని నుండి శంకరపల్లి రహదారి మధ్యలో ఉన్న పాలవాగుపై వంతెన నిర్మించాలని కోరుతూ శంకరపల్లి గ్రామస్తులు దూట తిరుపతి ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తిరుపతి మాట్లాడుతూ... కేకే 5 గని నుండి శంకర్పల్లి వరకు సుమారు మూడు కిలోమీటర్ల దూరం ఉంటుందని వర్షా కాలంలో ఈ రహదారి గుండా ప్రయాణించడం కష్టమవుతుందని, వర్షాలు కురిసి వాగులు పొంగితే ఈ దారి గుండా రవాణా పూర్తిగా నిలిచిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గ్రామస్తుల చిరకాల వాంఛ అయిన పాలవాగుపై వంతెన నిర్మించి ఇబ్బందులు తొలగించాలని కోరారు. అలాగే మండలంలోని సండ్రోన్ పల్లి నుండి శంకర్పల్లి కి వెళ్ళే రహదారి పూర్తిగా ధ్వంసం అయిందని వెంటనే బిటి రోడ్డు ఏర్పాటు చేసి గ్రామస్తులకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు.

# కొమురయ్య కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలి

**నార్నూర్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రానికి చెందిన ఆశ్రమ పాఠశాల అవుట్ సోర్సింగ్ కుక్ రాథోడ్ కొమురయ్య ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. సోమవారం నిర్వహించిన అంత్యక్రియలో జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరాం జాదవ్, నార్నూర్ సహకార సంఘం చైర్మన్ ఆడే సురేష్, సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ పాల్గొన్నారు. అనంతరం కుటుంబీకులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ చైర్మన్ మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో అవుట్ సోర్సింగ్‌లో కుక్‌గా పని చేస్తున్న కొమరయ్య మృతి చెందడం బాధాకరమన్నారు. కొమురయ్య కుటుంబానికి రూపాయలు 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ



ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సేవాలాల్ ధర్మ ప్రచారక్ ఆడే ప్రేమ్ మహారాజ్, గులాబ్ మహారాజ్, మాజీ ఉపసర్పంచ్ చౌహాన్ మహేందర్, జేఏసీ మాజీ చైర్మన్ రాథోడ్ ఉత్తమ్, విద్యావేత్త బాలాజీ కాంబ్లే, పీసా చట్టం కోఆర్డినేటర్ రాథోడ్ సికిందర్, బీజేపీ మండల అధ్యక్షుడు రాథోడ్ బిక్షపతి, అఖిల భారతీయ బంజారా సేవా సంఘం మండల ప్రధాన కార్యదర్శి రాథోడ్ దిలీప్, హ్యూమన్ రైట్స్ ప్రెసిడెంట్ సుల్తాన్ ఖాన్, సహకార సంఘం డైరెక్టర్ దుర్గే కాంతారావు, మాజీ సర్పంచ్ రాథోడ్ విష్ణు, అశోక్, సుభాష్, గుంజ చిన్నయ్య, దేవిదాస్, సురేష్, మోహన్ తదితరులు ఉన్నారు.

## ఎకరానికి 25 వేల నష్టపరిహారం ఇవ్వాలి



**ముథోల్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లాలో కురిసిన భారీ వర్షాల వల్ల వరదల్లో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 25000 ప్రభుత్వం చెల్లించాలని మాజీ జడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సోమవారం లోకేశ్వరం మండలంలోని పంచ కూడా ధర్మోరా అబ్దుల్లాపూర్ మౌల తత్ర గ్రామాల్లో గోదావరి వరదలో ముంపు గురై పంటలను పరిశీలించి రైతులను నష్టం అడిగి తెలుసుకున్నారు. పంట నష్టం అధికారులు పక్కగా నిర్వహించి పరిహార అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి విన్నవించారు. జిల్లాలో పెద్ద ఎత్తున పంటలు నష్టం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని వారికి ప్రభుత్వం సహాయం చేయని పక్షంలో టిఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాటం చేస్తుందన్నారు

## నృత్యాలు కోలాటం చేసిన వైద్యులు



**నిర్మల్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
ప్రజల బాగోగులు చూసి నాడిపట్టి వైద్యం చేసే వైద్యులు గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం నృత్యాలు చేసి కోలాటం మారుతూ అందరినీ అలరింపజేశారు. పట్టణంలోని ఆదిత్య హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రామచంద్ర రెడ్డి డాక్టర్ స్వర్ణలత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది వైద్యులు గణేష్ నిమజ్జనం శోభాయాత్రలో ప్రత్యేక వేషధారణ ధరించి సంప్రదాయ పద్ధతిలో ముత్యాలు చేస్తూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## కుభీర్‌లో జానపదాలతో ఆకట్టుకున్న ఫోక్ సింగర్ సీతక్క

**సీతక్కని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు**



**కుభీర్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
కుబీర్‌లోని శ్రీ విట్టలేశ్వరాలయంలో ఆదివారం రాత్రి నిర్వహించిన గాన లహరి కార్యక్రమం అహుతులను అలరించింది. రాయలసీమ ప్రాంతంలోని అనంతపురం జిల్లాకు చెందిన సీతక్క నిజామాబాదులో పోలీస్ శాఖలో హోంగార్డుగా పనిచేస్తూ తనలోని కళకు బదులు పెడుతుంది జానపద పాటలు ఉద్యమ పాటలను ఆలపించి అందరిని ఆకట్టుకుంది. అధ్యంతం హాజరైన జనాలు చప్పట్లతో ఆమెకు మరింత ఉత్సాహాన్ని అందించారు. అనంతరం ఆమెను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువా పూలమాలలతో సత్కరించి అభినందించారు. చైర్మన్ వైస్ చైర్మన్లు డాక్టర్ బి.పెంటాజీ సూది రాజన్న బెంద్రీ శంకర్ మాజీ సర్పంచ్ బానాజీ విజయ్ కుమార్ ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు

# మళ్లీ వైరల్ అవుతున్న హైదరి వివాదాస్పద వ్యాఖ్యలు



సోషల్ మీడియాలో ఎప్పుడు ఎలాంటి వీడియోలు వైరల్ అవుతాయో ఊహించడం కష్టం. కొన్ని సార్లు సెలబ్రిటీలు చిన్న విషయాన్ని గురించి మాట్లాడినా ఆ వ్యాఖ్యలు వైరల్ అవుతాయి. ఎలాంటి వివాదం లేకున్నా కూడా కొన్ని సార్లు ఆ వ్యాఖ్యలను వివాదాస్పదం చేసే విధంగా వైరల్ అవుతాయి. ఎంతో మంది హీరోలు, హీరోయిన్స్ పొరపాటున అన్న మాటలు వైరల్ అయ్యాయి. కొన్ని సార్లు తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాల్సిన సందర్భం కూడా వస్తుంది. ఎంతో మంది హీరోలు హీరోయిన్స్ సోషల్ మీడియా ద్వారా ఏదో ఒక వ్యాఖ్య కారణంగా వైరల్ కావడం అనేది మనం చూస్తూనే ఉంటాం. అయితే వారు చేసిన వ్యాఖ్యలు నెలలు దాటిన తర్వాత వైరల్ కావడం అనేది చాలా అరుదుగా జరుగుతూ ఉంటుంది. ఇప్పుడు అదితి రావు హైదరి విషయంలో ఇలాగే జరుగుతోంది.2013లో వచ్చిన మర్డర్ 3 సినిమా సమయంలో అదితి రావు హైదరి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశం అవుతున్నాయి. దాదాపు పదేళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు ఆ వ్యాఖ్యలు ఎందుకు వెలుగులోకి వచ్చాయి అని ఆమె అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో సోషల్ మీడియా ఈ స్థాయిలో లేదని చెప్పాలి. అందుకే అప్పుడు అదితి చేసిన వ్యాఖ్యల ఇంపాక్ట్ ఎక్కువ లేదు. కానీ ఇప్పుడు మాత్రం ఆ వ్యాఖ్యలను చాలా మంది సీరియస్‌గా తీసుకుంటున్నారు. కొందరు ఆ వ్యాఖ్యలపై సానుకూలంగా స్పందిస్తూ ఉంటే, కొందరు మాత్రం అదితి యొక్క అహంకారపు వ్యాఖ్యలు అంటూ విమర్శలు చేస్తున్నారు. మొత్తానికి చాలా రకాలుగా అదితి రావు హైదరి వ్యాఖ్యలను ట్రోల్ చేసిన వారు ఉన్నారు. ఇంతకు మర్డర్ 3 సినిమా ప్రమోషన్ సమయంలో అదితి రావు హైదరీ చేసిన వ్యాఖ్యలు ఏంటంటే... మనిషికి నిజమైన బలం ఛాతిలో ఉండే సిలికాన్ కాదు, ఆత్మలో ఉండే ఉక్కు వల్ల లభిస్తుందని చెప్పుకొచ్చింది. ఆ సమయంలో మల్లికా షెరావత్ యొక్క సర్జరీ గురించి ప్రచారం జరుగుతోంది. అంతే కాకుండా మర్డర్ సినిమాకు మల్లికా షెరావత్‌కి సంబంధాలు ఉన్నాయి. దాంతో అదితి రావు ఆ సమయంలో చేసిన వ్యాఖ్యలు ఖచ్చితంగా మల్లికా గురించే అంటూ చాలా మంది కామెంట్ చేశారు. అప్పుడు పెద్దగా పట్టించుకోకున్నా ఇప్పుడు ఆ వ్యాఖ్యలను సోషల్ మీడియా ద్వారా వైరల్ చేసి మరీ అదితి రావు హైదరినీ నెటిజన్స్ ట్రోల్ చేస్తున్నారు. ఒక మహిళ అయ్యి ఉండి మరో మహిళ గురించి అలాంటి వ్యాఖ్యలు చేయడం ఎంత వరకు కరెక్ట్ అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం హీరోయిన్స్‌లో మెజార్టీ శాతం హీరోయిన్స్ ఏదో ఒక రకమైన కాస్మోటిక్ సర్జరీలు చేయించుకుంటున్నారు. బ్యూటీ పార్లర్‌లకు వెళ్లినంత ఈజీగా కాస్మోటిక్ సర్జరీలకు వెళ్తున్నారు. ఎక్కువ ప్రమాదం కాదు, చిన్న చిన్న లోపాలు ఉంటే సరి చేసుకునే అవకాశం ఉంటుంది. కొందరు హీరోయిన్స్ అయిదు.. పది సార్లు కూడా కాస్మోటిక్ సర్జరీకి వెళ్లిన సందర్భాలు ఉన్నాయి. అలాంటి వారు తమ అందం తమ ఇష్టం అంటున్నారు. శరీరంలోని ఏ భాగం అందంగా లేకున్నా అందంగా కనిపించాలన్నా ఖచ్చితంగా సర్జరీకి వెళ్లాలి. అందులో తప్పు లేదు, అలా చేయడం నేరం, ఘోరం కాదు అనేది చాలా మంది అభిప్రాయం. అయితే చాలా ఏళ్ల క్రితం అదితి రావు హైదరి ఈ వ్యాఖ్యలు చేసింది. అయితే ఇప్పుడు ఆమె అభిప్రాయం ఏమైనా మారిందా అనేది చూడాలి. ఇప్పుడు వైరల్ అవుతున్న ఈ వీడియోపై అదితి స్పందించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.




## సుమ కొడుకు కోసం గ్లోబల్ స్టార్..

స్టార్ యాంకర్ సుమ కనకాల కుమారుడు రోషన్ కనకాల తన రెండవ సినిమాతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యాడు. నేషనల్ అవార్డు విన్నర్, 'కలర్ ఫొటో' మూవీ ఫేమ్ సందీప్‌రాజ్ దర్శకత్వంలో 'మోగ్లీ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. ఈ చిత్రం అక్టోబర్ 17న థియేటర్స్ లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మూవీ ప్రమోషన్స్ మొదలు పెట్టింది చిత్రబృందం. ఇందులో భాగంగా గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ చేత ట్రైలర్ లాంచ్ చేయించారు. ట్రైలర్ లాంచ్ అనంతరం చరణ్ చిత్రబృందంతో కలిసి ముచ్చటించారు. టీమ్ అందరికీ బెస్ట్ విషెస్ తెలియజేశారు. అలాగే సినిమా ట్రైలర్ చాలా బాగుందని ప్రశంసించారు. విజువల్ ఎఫెక్ట్స్, సినిమాటోగ్రాఫీ, ఎలివేషన్స్ చాలా బాగున్నాయని అభినందించారు. ముఖ్యంగా లొకేషన్స్ అద్భుతంగా ఉన్నాయని అన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. 'కలర్ ఫొటో' ఫేం సందీప్‌రాజ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించడంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఒక రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ గా ఈ చిత్రాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే నాని వాయిస్ ఓవర్ తో విడుదల చేసిన "ది వరల్డ్ ఆఫ్ మోగ్లీ" గ్లింప్స్ వీడియో సినిమాపై ఆసక్తిని పెంచింది. ఫ్రెష్‌ఫీల్ తో ఆడియన్స్ ని ఆకట్టుకుంది. ముఖ్యంగా నాని వాయిస్ ఓవర్ తో చెప్పిన డైలాగ్స్ హైలైట్ గా నిలిచాయి. ఇందులో రోషన్ కి విలన్ గా బండి సరోజ నటించడం విశేషం. 'కలర్ ఫొటో' తో నేషనల్ అవార్డు కొల్లగొట్టిన సందీప్ ..ఇప్పుడు మోగ్లీ తో ఎలాంటి హిట్ కొడతాడో చూడాలి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆస్కార్ విజేత కుమారుడు ఎం.ఎం. కీరవాణి కుమారుడు కాల భైరవ సంగీతం అందించారు. RRR చిత్రానికి అసిస్టెంట్ DOP గా వర్క్ చేసిన రామా ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ గా పనిచేశారు. ఇదిలా ఉంటే రోషన్ 'బబుల్ గమ్ ' సినిమతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చాడు. ఈ చిత్రానికి 'కృష్ణ అండ్ హీజ్ లీలా ' ఫేమ్ రవికాంత్ పేరుపు దర్శకత్వం వహించారు. తొలి సినిమాతోనే రోషన్ తన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇందులో రోషన్ నటన, డైలాగ్ డెలివరీ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఒక రొమాంటిక్ ఎంటర్ టైనర్ గా యూత్ ని అలరించింది. ఈ చిత్రాన్ని కూడా పీపుల్ మీడియా ఫాక్టరీ నిర్మించింది.



## అనుష్క పెళ్లి..?

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క నటించిన లేటెస్ట్ మూవీ 'ఘాటీ' ఈనెల 4న థియేటర్స్ లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మూవీ ప్రమోషన్స్ షురూ చేశారు మేకర్స్. అయితే పలు కారణాల చేత నేరుగా మూవీ ప్రమోషన్స్ లో పాల్గొనలేకపోతున్న అనుష్క.. ఆఫ్ స్క్రీన్ లో మూవీ ప్రమోట్ చేయడం మొదలు పెట్టారు. ఇందులో భాగంగా హీరో-రానాతో ఫోన్ కాల్ ఇంటర్వ్యూలో పాల్గొంది అనుష్క. ఇందులో అనుష్క 'ఘాటీ' చిత్రం గురించి పలు విశేషాలను పంచుకున్నారు. అనుష్క- రానా సరదా సంభాషణలతో సాగిన ఈ ఇంటర్వ్యూ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.



## సీఎం సిద్ధరామయ్యతో చరణ్ భేటీ..

కర్ణాటక సీఎం సిద్ధరామయ్యను గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కలిశారు. మైసూరులో వీరిద్దరి భేటీ జరిగింది. కాసేపు ఇరువురు మాట్లాడుకున్నారు. రామ్ చరణ్ హీరోగా నటిస్తోన్న పెద్ది సినిమా షూటింగ్ ప్రస్తుతం మైసూరులో జరుగుతోంది. ఈ క్రమంలో అక్కడే సీఎం సిద్ధరామయ్య పర్యటిస్తూ ఉండటంతో వీరి భేటీ జరిగింది. ఈ భేటీలో కార్మిక శాఖ మంత్రి సంతోష్ లాడ్, శాసనమండలి సభ్యుడు డాక్టర్ యతీంద్ర కూడా ఉన్నారు. ఈ సందర్భంగా సీఎం సిద్ధరామయ్యను శాలువతో కప్పి సత్కరించారు రామ్ చరణ్. మైసూరులో అద్దూరి సెట్ వేసి ఓ మాస్ సాంగ్‌ను మేకర్స్ షూట్ చేస్తున్నారు. దాదాపుగా 1,000 మంది డ్యాన్సర్స్ తో ఈ పాటను ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ జానీ కొరియోగ్రాఫ్ చేస్తున్నారు. కాగా ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సనా డైరెక్షన్ లో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తుంది. శివరాజ్ కుమార్, జగపతి బాబు కీలక పాత్రాల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు ఆస్కార్ అవార్డు విజేత ఏ.ఆర్.రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.ఈ సినిమా 2026 మార్చి 27న విడుదల కావచ్చని సమాచారం. ఇప్పటికే విడుదలైన సినిమా పోస్టర్‌లు, గ్లింప్స్‌లో రామ్ చరణ్ రూరల్, రస్టిక్ లుక్ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తించింది. పక్కా గ్రామీణ బ్యాక్ డ్రాప్ లో ఈ సినిమా ఉండబోతుందని అర్థమైంది. 'గేమ్ ఛేంజర్' ఫ్లాప్ తర్వాత రామ్ చరణ్ నుంచి రాబోతున్న ఈ సినిమాపై ఫ్యాన్స్ లో అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను వృద్ధి సినిమాస్ నిర్మించగా, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నారు.

# ప్రజా సమస్యలపై శాశ్వత పరిష్కారం చూపాలి

## ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**

ప్రజా సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ వచ్చిన ప్రతి ఒక్క ఫిర్యాదును స్వీకరిస్తూ ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే దిశగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలియజేశారు. సోమవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయం నందు గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ కి, జిల్లా నలుమూలల నుండి ఫిర్యాదుదారులు పెద్ద ఎత్తున తరలివచ్చి నేరుగా పోలీసు ముఖ్య అధికారికి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలిచ్చి ప్రజా సమస్యలనకు సిబ్బందిని కేటాయించి త్వరితగతిన సమస్యల పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు. ప్రజా సమస్యలను విన్నవించిన ఫిర్యాదులలో భూ సమస్యలు, ఫోర్జరీ సమస్యలు, కుటుంబ కలహాల సమస్యలు, భార్యాభర్తల మధ్య గొడవ, తండ్రి కొడుకులు సమస్యలు, కేసుల పురోగతి, కేసుల దర్యాప్తు తదుపరివాటిపై సమస్యలను జిల్లా పోలీసు ముఖ్య అధికారికి నేరుగా ఫిర్యాదులను అందించి సమస్యలను



విన్నవించుకున్నారు. ఈరోజు దాదాపు 23 మంది ఫిర్యాదుదారులు జిల్లా నలుమూలల నుండి తమ సమస్యలను తెలియజేయడం జరిగింది. సుదూర ప్రాంతాల వారు మరియు జిల్లా ఎస్పీకి నేరుగా సమాచారం అందించాలనుకునే వారు నేరుగా వాట్సఅప్ ద్వారా తమ సందేశాన్ని 8712659973 నెంబర్ కు తెలియజేయాలని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.



## ప్రజావాణికి 84 దరఖాస్తులు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**

ప్రజావాణి సందర్భంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ సలోని. ఆయా మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వచ్చిన ఫిర్యాదులను కలెక్టర్ స్వీకరించి , ఆయా శాఖలకు అప్పగిస్తూ త్వరిత గతిన పరిష్కరించాలని అన్నారు. ఈ సందర్భంగా 84 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

## మృత్యువును జయించిన రైతు కూలీ



**ఖానాపూర్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**

గోదావరి పరిసర ప్రాంతంలో ఎవరు వెళ్ళకూడదని జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు ఖానాపూర్ సీఐ అజయ్, ఎస్ఐ రాహుల్ ప్రజలకు హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. కానీ.. ఏ మాత్రం పట్టించుకోకుండా ఓ రైతు కూలి ఉగ్రరూపంలో ఉన్న గోదావరి లో పడి కొట్టుకుపోయిన ఘటన ఖానాపూర్ మండలం లోని బాధనకుర్తి గ్రామంలో చోటుచేసుకుంది. నిర్మల్ జిల్లా కడెం మండలంలోని ధర్మాజిపేట్ గ్రామానికి చెందిన మాదస్తు మల్లయ్య గత 20 సంవత్సరాల క్రితం ఖానాపూర్ మండలంలోని బాధనకుర్తి గ్రామానికి కూలి పని కోసం వలస వచ్చి ఆ గ్రామంలో నివాసం ఉంటున్నారు. మల్లయ్య ఆదివారం గ్రామానికి పక్కన ఉన్న గోదావరి మేకల రేవు, స్మశాన వాటిక ప్రాంతంలో చూడడానికి వెళ్లిన ఆయన ప్రమాదవశాత్తు గోదావరి నదిలో పడి గోదారి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. ఈ క్రమంలో అక్కడ ఉన్న కొందరు ఆయనను ఒడ్డుకు రా అని కేకలు వేయగా, గోదావరి ప్రవాహానికి కొట్టుకపోతున్న ఆయన ఈదుకుంటూ మలుపు ప్రాంతంలో ఒడ్డు ప్రాంతానికి చేరుకున్నాడు. ఎట్టకేలకు ఒడ్డుకు చేరుకుని మృత్యువుని జయించాడు.

## బాసర ఆలయ స్పెషల్ ఆఫీసర్‌గా భైంసా సబ్ కలెక్టర్

**ముథోల్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**



తెలంగాణలో పవిత్ర పుణ్యక్షేత్రమైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ స్పెషల్ ఆఫీసర్ గా భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సాంకేత్ కుమార్ ను నియమిస్తూ నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. గత రెండు సంవత్సరాలుగా వస్తున్న ఇతరాత్ర ఫిర్యాదుల నేపథ్యంలో బాసర ఆలయ ప్రతిష్ట, భక్తుల నిత్య అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు ఓ ప్రకటన జారీ చేశారు. ఈ రోజు నుంచి సబ్ కలెక్టర్ అజ్మీరా సంపత్ కుమార్ విధులలో జాయిన్ అవ్వనున్నారు. రానున్న నవరాత్రుల నేపథ్యంలో కలెక్టర్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని భక్తులు అంటున్నారు.

## పూటగడవాలంటే వాగుదాటాల్సిందే



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని పలు గ్రామాల ప్రజలకు వానాకాలం వస్తే చాలు.. అత్యవసరమైన..! నిత్యావసరమై వాగులు దాటితేనే చేతికి వచ్చే స్థితి ఏర్పడింది. కెరమెరి మండలంలోని లక్ష్మి పూర్, అనార్పల్లి శివారులోని పెద్దవాగు అవతల వైపున్న 12 గ్రామాల ప్రజలకు వర్షంలో ప్రయాణం కత్తి మీద సాములా మారింది. ఆదివారం కెరమెరి వారాంతపు సంత కావడంతో నిత్యావసర వస్తువుల కొనుగోలు చేసేందుకు ఆ ప్రాంత ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని నడుములోతు నీటిలో గ్రామస్తులు ఒకరి చేయి ఒకరు పట్టుకుని వాగు దాటుతున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియా వైరల్ గా మారింది. పది రోజుల క్రితం ఇదే తరహాలో బోరిలాల్ గూడ గ్రామానికి చెందిన పవార్ కవిత అనే గిరిజన మహిళ రోగిని ఆసుపత్రికి తరలించేందుకు పీకల్లోతు నీటిలో భుజం పై ఎక్కించుకొని కుటుంబ ఆ మహిళను ఇదే వాగు దాటించిన ఆస్పత్రికి తరలించారు. వాగు పై వంతెన నిర్మిస్తే తమ కష్టాలు తీరుతాయని ఆ ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు.

## మహా ధర్నాకు బయలుదేరిన పీఆర్టీయూ నాయకులు

**బోథ్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**

సీపీఎస్ అంతం పీఆర్టీయు పంతం అనే నినాదంతో పీఆర్టీయు ఉపాధ్యాయ సంఘం పిలుపు మేరకు సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద జరగబోయే మహాధర్నా కార్యక్రమానికి బోథ్, సోనాల మండలాల పీఆర్టీయు నాయకులు, ఉపాధ్యాయులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ నాయకులు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే సీపీఎస్ ను రద్దు చేసి పాత ఫించను విధానాన్ని అమలు చేయాలి అని అన్నారు. అంతేకాకుండా పెండింగ్ లో ఉన్న ఐదు డీఏలు, పీఆర్సీ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ బోథ్ అధ్యక్షుడు ఆర్టీవి ప్రసాద్, కార్యదర్శి సంగు స్వామి, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.





## అర్ధరాత్రి ఆవుల బీభత్సం

**బోథ్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**

నియోజకవర్గ కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో అర్ధరాత్రి ప్రాంతంలో ఆవులు ఇంట్లోకి చొరబడి వస్తువులు అన్ని చిందర వందర చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే అంబేద్కర్ కాలనీకి చెందిన ఆర్ష చిన్న పోశెట్టి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఒకేసారి ఆవులు అన్ని ఇంట్లోకి వెళ్లి ఇంట్లో ఉన్న వస్తువులు, వంట సామాగ్రి చిందర వందర చేశాయి. అలాగే నిద్రిస్తున్న పోశెట్టి పైన కూడా ఆవులు వెళ్ళడంతో అతను కాలనీ వాసులు లేచి ఆవుల్ని తరమడంతో ప్రాణాలతో బయటపడ్డానని బాధితుడు వాపోయాడు. హమాలీ సంఘం అధ్యక్షుడు మల్యాల రాజేశ్వర్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబం అయిన చిన్న పోశెట్టినీ ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అంతేగాకుండా ఊరి మీద తిరిగే ఆవుల వలన ప్రజలు చాలా ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఆవుల పైన గ్రామపంచాయతీ వారు కఠిన నిర్ణయం తీసుకోవాలి అని కోరారు.

## యూరియా కోసం తిప్పలు

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. రోజూ ఏదో ఒకచోట రైతన్నలు యూరియా కోసం ఆందోళన చేస్తూ కనిపిస్తున్నారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలోని భట్పల్లి వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఎదుట రైతులు యూరియా కోసం ఆందోళన దిగారు. 20 రోజుల క్రితం యూరియా ఇస్తామని మాకు చిటీలు రాసి ఇచ్చి సహకార సొసైటీ అధికారులు.. ఇప్పుడు యూరియా స్టాక్ లేదని చెప్తున్నారు. మరీ ఫర్టిలైజర్ షాపుల్లో ఎక్కడ లేని వ్యవసాయ శాఖ అధికారులను నిలదీశారు. మాకు చీటీల.. ఫర్టిలైజర్ షాపులకు ఏమో యూరియా అని రైతు కామెంట్ చేశారు. అధికారులు వ్యాపారులు కుమ్మక్కై రైతుల రక్తం పీలుస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం తీరుపై అసహనం వ్యక్తం చేశారు.



## ఎస్పీని సన్మానించిన గ్రామస్థులు



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**

గత సంవత్సరం జైనూర్ మండల పరిధిలో జరిగిన సంఘటనలో, ఒక మహిళపై అత్యాచారయత్నం మరియు హత్యాయత్నం చేసిన నిందితుడికి, ఇటీవల ఆదిలాబాద్ ఎస్సీ ఎస్టీ కోర్టు జీవిత ఖైదు జైలు శిక్ష, రూ.30,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితుడిని పట్టుకొని, ఆధారాలు సేకరించి, సకాలంలో కోర్టుకు సమర్పించి, తీర్పు త్వరితగతిన వెలువడేలా కృషి చేసిన జిల్లా పోలీస్ శాఖ ప్రయత్నాలను ప్రజలు అభినందించారు. ఈ సందర్భంగా జైనూర్ ప్రాంత వాసులు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కాంతిలాల్ పాటిల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించారు. తీర్పుతో సంతృప్తి వ్యక్తం చేసిన జైనూర్ ప్రజలు మాట్లాడుతూ జిల్లా పోలీస్ శాఖ చేసిన కృషి మరువలేనిది. నేరానికి పాల్పడిన వారికి శిక్ష తప్పదనే నమ్మకాన్ని ఈ తీర్పు కలిగించింది అని అభిప్రాయపడ్డారు. జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ మాట్లాడుతూ నేరం చేసే వారిని ఎవరినీ చట్టం వదిలిపెట్టదు. ఎవరైనా ఎంతటి ప్రభావం ఉన్న వారైనా చట్టరీత్యా తప్పక శిక్షించబడతారు. మహిళలపై జరిగే నేరాల విషయంలో పోలీస్ శాఖ కఠిన వైఖరి అవలంబిస్తుంది. ఇలాంటి నేరస్తులు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరు. ఎవరైనా చట్టానికి అందకుండా తప్పించుకోలేరని, చట్టం ముందు అందరూ సమానమే అని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్‌గోండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అనకా దేవేందర్, మేస్రం మోతిరామ్ రాజ్‌గోండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆత్రం ఆనందరావు రాజ్‌గోండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, భగవంతరావు రాయ్ సెంటర్, ఆనందరావు రైసెంటర్, కుమ్రా దుందేరావు రాయ్ సెంటర్ సర్మేది, మడవి భీంరావు మాజీ సర్పంచ్, కుమ్రా శ్యాంరావు మాజీ సర్పంచ్, రాయ్ సెంటర్ ఆత్రం అర్జున్‌లు పాల్గొన్నారు.



# వరద నష్టంపై స్పష్టమైన నివేదిక రూపొందించాలి

## కలెక్టర్ల వీడియోకాన్ఫరెన్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం

**నిర్మల్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల వలన జరిగిన ప్రాణ-ఆస్తి నష్టాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా అంచనా వేసి తక్షణం నివేదికలు సమర్పించాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ సచివాలయం నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం వరద నష్టం పై సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. జిల్లాల కలెక్టర్లతో నేరుగా మాట్లాడిన ముఖ్యమంత్రి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని, పంట నష్టం, ఇళ్ల దెబ్బతినడం, రహదారులు, చెరువులు, వంతెనలకు జరిగిన నష్టాలను విభాగాలవారీగా ఖచ్చితంగా లెక్కించి సమర్పించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వానాకాలం జిల్లాలో భారీ వర్షాల వలన జరిగిన ఆస్తి, ప్రాణ నష్టాలను క్షేత్రస్థాయిలో సర్వే చేసి, అంచనా నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. రెవెన్యూ, విద్య, వైద్య, వ్యవసాయ, పశుసంవర్ధక, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, ఆర్డబ్ల్యుఎస్, మత్స్య, విద్యుత్ తదితర శాఖల అధికారులందరూ ఎస్‌డిఆర్‌ఎఫ్ నిబంధనలకు అనుగుణంగా రేపటిలోగా రిపోర్టులు సమర్పించాలని సూచించారు. వరదల వల్ల నిరాశ్రయులైన కుటుంబాల కోసం తాత్కాలిక శిబిరాలను ఏర్పాటు చేసి, అక్కడ అవసరమైన ఆహారం, తాగునీరు, వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా నదులు, వాగుల వద్దకు వెళ్లకుండా గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటికే జిల్లాలో ఇప్పటి వరకు దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, భవనాలు రిపోర్టులను అధికారులు కలెక్టర్‌కు నివేదించారు. అలాగే పంటలు మునిగిన ప్రాంతాలను త్వరితగతిన సర్వే చేసి, రైతులకు అందే సహాయానికి సంబంధించి అంచనాలను సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, బైంసా సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### నిర్మల్ జిల్లాలో

# యూరియా కొరత లేదు

### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో రైతులకు యూరియా ఎరువుల కొరత లేదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. జిల్లాలో అవసరమైనంత మోతాదులో యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఎరువుల దుకాణాలను ఉదయం 8 గంటలకు తెరిపిస్తున్నామని చెప్పారు. రైతులు ఒకేసారి గుంపులుగా దుకాణాలకు వెళ్లకుండా విడతల వారీగా వెళ్లి అవసరమైనంత మేరకు మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. యూరియా కొరతపై అసత్య ప్రచారాలను రైతులు నమ్మవద్దని, జిల్లాలోని ప్రతి రైతు అవసరానికి తగ్గట్టుగానే యూరియా అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు కట్టుదిట్టంగా పర్యవేక్షిస్తున్నారని కలెక్టర్ తెలిపారు.



# అసెంబ్లీ కో-ఆర్డినేటర్‌గా షేక్ ఫజల్



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
కాంగ్రెస్ సోషల్ మీడియా ఆసిఫాబాద్ అసెంబ్లీ కో ఆర్డినేటర్‌గా జైనూర్ మండల కేంద్రానికి చెందిన షేక్ ఫజల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాల ఆరోపణలను సోషల్ మీడియా వేదికగా తిప్పికొడతామని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, పార్టీ సిద్ధాంతాలను సోషల్ మీడియా వేదికగా ప్రజలకు మరింత చేరువచేసేందుకు కృషి చేస్తానన్నారు. నియామకానికి సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ , మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, టీపీసీసీ ఉపధ్యక్షురాలు సుగుణక్క, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండా శ్యామ్, జైనూర్ మండల కాంగ్రెస్ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# సమాజంలో విలేకరుల పాత్ర కీలకమైంది

**ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
సమాజంలో జరుగుతున్న అన్ని విషయాలను ప్రజలకు తెలియపర్చడంలో విలేకరుల పాత్ర కీలకమైనదని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ అధ్యక్షుడు సోన్ కాంబ్లే జితేందర్ పేర్కొన్నారు. సోమవారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో అన్ని పత్రికల విలేకరులను నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ తరుపున శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ అధ్యక్షుడు సోన్ కాంబ్లే జితేందర్ మాట్లాడుతూ. నిత్యం ప్రజలకు అధికారులకు ప్రజలకు వారధులుగా విలేకరులు ఉంటారని అన్నారు.సమాజంలో



జరుగుతున్న అన్యాయాలను, అవినీతిని వెలికితీయడంలో విలేకరులు ప్రధాన భూమికను పోషిస్తారని అన్నారు. అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ సభ్యులు, భీం ఆర్మీ నాయకులు పాల్గొన్నారు.



### ఐఐఎస్ఈఆర్‌కు ఎంపికైన ఆదర్శ

# పాఠశాల విద్యార్థికి సన్మానం

**నార్నూర్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
నార్నూర్ మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల విద్యార్థిని రాథోడ్ అలేఖ్య ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌కు ఎంపిక కావడం హర్షనీయమని పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రశాంత్ అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు విద్యార్థికి శాలువాతో సన్మానించి అభినందించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ అలేఖ్య బీఎం-ఎంఎస్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాం కు ఎంపికవ్వడం పాఠశాలకు గర్వకారణమని అన్నారు. విద్యార్థులు నిరంతరం కృషి పట్టుదలతో చదువుకొని లక్ష్యాన్ని సులువుగా సాధించగలుగుతారన్నారు. అలేఖ్యను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు పోటీ తత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

# క్యాడర్ స్కీం ప్రమోషన్ పత్రాల అందజేత



**మందమర్రి, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
మందమర్రి ఏరియాలో ఇన్చార్జి జీఎం విజయ ప్రసాద్ ఆధ్వర్యంలో ఉద్యోగులకు క్యాడర్ స్కీం ప్రమోషన్లకు సంబంధించిన ఆఫీస్ ఆర్డర్లను అందజేశారు. సోమవారం జిఎం కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ నుంచి సీనియర్ అసిస్టెంట్గా క్యాడర్ స్కీం ద్వారా ప్రమోషన్ పొందిన వారికి ఈ ఆర్డర్లను అందించినట్లు అధికారులు తెలిపారు. ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి మరిన్ని ఉన్నత స్థానాలు అందుకోవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# బహిరంగ ప్రదేశాల్లో నిషేధాజ్ఞలు

**మంచిర్యాల, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమలులో ఉన్న నిషేధాజ్ఞలను అక్టోబర్ 1 వరకు పొడిగిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ తెలిపారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ భవన సమావేశం మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఆసిఫాబాద్ మండలం బూర్గుడ గ్రామంలోని ఎస్. సి. కాలనీకి చెందిన చిలారి శిల్ప రాణి తనకు దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ పట్టణం పైకాజీ నగర్ కు చెందిన నైతం మోహన్ తన కూతురు రాజేంద్రప్రసాద్ బిఈడి కళాశాలలో చదివినందున ధ్రువపత్రాలు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండల కేంద్రానికి చెందిన పెరుమాండ్ల వెంకటేష్ జనకాపూర్ శివారులో తనకు గల భూమికి పట్టా పాసు పుస్తకం జారీ చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ మండలం గోవిందపూర్ గ్రామానికి చెందిన విలాస్ తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం జనకాపూర్ కు చెందిన సమీనా బేగం తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. తిర్యాణి మండలం తలండి గ్రామానికి చెందిన పెట్టం రాజలింగు తమ తండ్రి పేరిట గల భూమికి పట్టా పాసు పుస్తకం జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, దరఖాస్తులు పెండింగ్ లో లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.



## ప్రజావాణిలో అందిన దరఖాస్తులను
# సమన్వయంతో పరిష్కరించాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులు సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణంలోని 5వ వార్డు సాయి కుంట కాలనీవాసులు తమ కాలనీలో కోతుల బెడద అధికంగా ఉందని, పరిష్కరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. నస్పూర్ మండలం తీగల్పహాడ్ గ్రామానికి చెందిన మంద రాయమల్లు, మంద శ్రీనివాస్ లు తాము నివసిస్తున్న ఇంటికి సంబంధించి అసెస్మెంట్ రికార్డులు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. భీమారం మండలం అంకుసాపూర్ గ్రామానికి చెందిన కామెర లక్ష్మి తాను గతంలో సదరం సర్టిఫికెట్ కొరకు దరఖాస్తు చేసుకోగా 50 శాతంతో ధ్రువపత్రం మంజూరు చేసినందున దివ్యాంగ పింఛన్ రాలేదని, పింఛన్ రిజెక్ట్ అయిన వివరాలను తొలగించి భర్త మరణించినందున తనకు వితంతు పింఛన్ ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండలం పొన్నారం గ్రామానికి చెందిన పుప్పాల సంతోష్ గతంలో తన నాయనమ్మ పట్టాదారుల నుండి సాదా బైనమా ద్వారా భూమి కొనుగోలు చేసిందని, ఇట్టి భూమికి సంబంధించి తమకు పట్టా పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి మండలం అంకుశం గ్రామానికి చెందిన పిట్టల సునంద తాను వ్యవసాయ కూలీగా పనిచేసుకుంటూ జీవిస్తున్నానని, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు జాబితాలో తన పేరు ఉందని, కానీ తాను ఏ విధమైన లబ్ధి పొందలేదని, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి పట్టణం గ్రౌండ్ బస్తీకి చెందిన కుక్కల అనసూయ తాను తన తల్లితో కలిసి ఉంటున్నానని, ప్రభుత్వ పథకాలలో కంప్యూటర్, కుట్టు మిషన్ ఇతర రంగాలలో శిక్షణ పొందానని, తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. చెన్నూరు మండలం సుద్దాల గ్రామానికి చెందిన రామగిరి కిష్టయ్య ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తన పేరు వచ్చిందని, కానీ ఇల్లు మంజూరు కాలేదని, అనాధ అయిన తనకు ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి మండలం శ్రీపతి నగర్ కు చెందిన సముద్రాల సుజాత దివ్యాంగురాలిని అయిన తనకు దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జైపూర్ మండలం ఇందారం గ్రామానికి చెందిన దగ్గుల వేణు తమ భూమిని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ కు బొగ్గు రవాణా చేసేందుకు రైల్వే ట్రాక్ నిర్మాణం కొరకు తీసుకోవడం జరిగిందని, ఈ సందర్భంలో ఉపాధి కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, జీవన ఆధారమైన భూమిని



కోల్పోయిన తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దళిత సంఘాల ప్రతినిధులు బొజ్జ శరత్, నక్క శ్రీనివాస్, తీగల శ్రీనివాస్ లు జిల్లాలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టి, ఆత్మ గౌరవాన్ని కాపాడడం కొరకు ఎస్.సి., ఎస్.టి. మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుంది



**ముథోల్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)** రైతులు పంటలు నష్టపోయిన రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం తప్పక ఆదుకొని అండగా నిలుస్తుందని కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి అన్నారు. మండల కేంద్రమైన ముథోల్ లో సోమవారం భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను అలాగే రోడ్డును పరిశీలించారు. రైతులకు పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు తమ నష్టపోయిన పంట వివరాలను సంబంధిత అధికారులకు తెలియజేయాలని తెలిపారు. త్వరలోనే అధికారులు కూడా ప్రాథమిక సర్వే కొనసాగిస్తారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు తప్పక ఆదుకుంటామని చెప్పారని అన్నారు. అలాగే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలే కాకుండా ఇండ్లు తదితర వాటిని కూడా ప్రత్యేక చర్యలు తీసుకొని ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. ఇప్పటికే పెద్ద ఎత్తున ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నది గుర్తు చేశారు. జిల్లాలోని జరిగిన నష్టంపై వెంటనే అధికారులకు కూడా తెలియజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు ఇల్లు కూలిపోయిన వారికి ఇందిరమ్మ ఇండ్లు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందిస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్, ఆత్మ చైర్మన్ నర్సారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగారెడ్డి, నాయకులు రావుల శ్రీనివాస్, ఖాలీద్ పటేల్, ప్రేమ్ నాథ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

### కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల దృష్ట్యా, ప్రశాంత వాతావరణ పరిస్థితులను మరింత సవ్యంగా కొనసాగించడానికి సెప్టెంబర్ 01 వ తేదీ నుండి సెప్టెంబర్ 30 వ తేది వరకు జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ సోమవారం రోజు ఒక ప్రకటన లో తెలిపారు. 30 పోలీస్ యాక్ట్-1861 అమల్లో ఉన్నందున జిల్లాలోడిఎస్పి/ఎఎస్పీ లేదా ఆపై పోలీస్ ఉన్నతాధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, బహిరంగ సభలు, తదితర ప్రజలు గుమికూడి ఉండేవిధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. నిషేధిత ఆయుధాలు, దురుద్దేశంతో నేరాలకు ఉసి కోలిపే ఎటువంటి ఆయుధాలు కల్గిఉండరాదని తెలిపారు. ప్రజా జనజీవనానికి ఇబ్బంది, చిరాకు కల్గించేందుకు దారి తీసే ఇబ్బందికర ప్రజా సమావేశాలు, జన సమూహం అలాంటివి పూర్తిగా నిషేధం అన్నారు. చట్టపరమైన జారీచేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం శిక్షార్హులు అవుతారని సూచించారు. నిషేధంలో ఉన్న నిబంధనలను తప్పనిసరిగా అందరూ పాటించాలన్నారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తుగా దరఖాస్తు చేసుకొని అనుమతులు తీసుకోవాలని సూచించారు. 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ఎటువంటి అనుమతులు లేని ర్యాలీలు నిర్వహించిన వారిపై కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

### నల్ల బ్యాడ్జీలతో మున్సిపల్ సిబ్బంది నిరసన

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)** ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం వాల్పరుస్తున్న సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బెల్లంపల్లి పట్టణంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట సిబ్బంది భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ మేనేజర్ ఎండీ మజార్ మాట్లాడారు. కొత్త పెన్షన్ విధానంతో ఉద్యోగులకు తీరని నష్టం ఏర్పడుతుందని ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.




## కాళేశ్వరం జలాలతో కేసీఆర్ చిత్రపటానికి జాలాభిషేకం

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)** తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి పంటలకు,ప్రజలకు సాగు,తాగు నీరు అందించే గొప్ప ఆలోచనతో కట్టిన ప్రాజెక్టు కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ,మాజీ ప్రభుత్వ విప్,మంచిర్యాల జిల్లా పార్టీ అధ్యక్షులు బాల్క సుమన్ గపిలుపు మేరకు అన్నారం సరస్వతీ బ్యారేజ్ వద్ద బీ ఆర్ ఎస్ వీ జిల్లా అధ్యక్షులు బడికల శ్రావణ్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి కాళేశ్వరం జలాలతో జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బడికల శ్రావణ్ మాట్లాడుతూ ఆనాడు తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఉన్నటువంటి సమస్యలు నా తెలంగాణ రాష్ట్రంలో ఉండొద్దు అని గొప్ప ఆలోచన చేసిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి వర్యులు కేసీఆర్ తెలంగాణ ఏర్పాటు కాగానే రైతులు సంతోషంగా ఉండాలి పంటలు సంవృద్దిగా పండాలి అని తెలంగాణ ప్రాంతంలో ఉన్న ప్రజలకు తాగునీరు అందించాలి అనే ఉద్దేశ్యంతో నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టు తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టు అని అన్నారు,ఈ ప్రాజెక్టు ద్వారా యావత్ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న సుమారు 1 లక్ష ఎకరాలకు పైగా సాగునీరు అందించి రైతుల కష్టాలు దూరం చేసిన రైతుబంధవుడు కేసీఆర్ గారు అని అలాగే నల్గొండ




ఫ్లోరైడ్ బాధితులకు తాగు నీరు అందించి ఫ్లోరైడ్ సమస్యను దూరం చేసి తెలంగాణ రాష్టాన్ని సస్యశ్యామలం చేయడం జరిగింది. అబద్ద ప్రచారాలు చేస్తూ తెలంగాణా ప్రజలకు మాయ మాటలు చెప్తూ కేసీఆర్ పార్టీని బదునం చేయాలని కుట్రలు చేయడం సిగ్గుచేటు అని అన్నారు ఇప్పటికి అయిన ఈ కర్కశ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అబద్ధపు మాటలు అసత్య ప్రచారాలు మానుకొని తెలంగాణ ప్రజలకు నీరు అందించాలి అని పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు పట్టణ అధ్యక్షులు నాయబ్, సీనియర్ నాయకులు అసంపెల్లి సంపత్,ప్రశాంత్ రెడ్డి స్థానిక మాజీ సర్పంచ్ రాయ మల్లు, నాయకులు రాజుకుమార్, బాపు నాయక్, రమేష్, అజయ్, ప్రసాద్, మల్లేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేయలేక ఆరోపణలు

## బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్



**మంచిర్యాల, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయం లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమై బీఆర్ఎస్‌పై అసత్య ఆరోపణలు చేస్తూ కాలం వెల్లదీసుకుంటూ వస్తుం దని బీఆ ర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమ న్ అన్నారు. సోమవారం మాజీ ఎంఎల్ఏ నడిపెల్లి దివాకర్‌రావుతో కలిసి ఆయన మా ట్లాడారు. ఎన్నికల హామీలు, డిక్లరేషన్ లు అమలు చేయలేక మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మీద, పార్టీపై లేనిపోని కథలు అల్లుతుందని, ఎన్నికల సమయంలో ఏదో సాకు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందన్నారు. ఒక సారి కాళేశ్వరం, మరోసారి లిక్కర్ స్కాం, ప్రస్తుతం సీబీఐ పేరిట రాష్ట్ర ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. సీబీఐ, ఈడీలు కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉందని చెప్పిన రేవంత్ రెడ్డి ఎలా సీబీఐకి కేసు అప్పగించారని ప్రశ్నించారు. బీజేపీ మోదీ ఆదేశాలతోనే కాంగ్రెస్ రేవంత్ పని చేస్తున్నారని, గోదావరి నీటిని ముఖ్యమంత్రి పాత గురువు, కొత్త గురువులకు తర లించేందుకే కాళేశ్వరం ప్రాజె క్టు మరమ్మతులు చేయించ కుండా వారి కో సం పని చేస్తున్నారని విమర్శించారు. ప్రభు త్వం వైఫల్యాలను ఎండగట్టారు. తెలంగాణ ప్రజలు ఇక కాంగ్రెస్, బీజేపీలను నమ్మే పరిస్థితి లేదన్నారు. ప్రజలను, రైతులను ఇబ్బంది పెట్టేందుకే యూరియా కొరత సృష్టిస్తుంద ని, ప్రజలు గమనిస్తున్నారని, బుద్ధి చెబుతారని హెచ్చరించా రు. మాజీ మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, బీఆర్ఎస్ నాయకులు రాజా రమేశ్, సత్యం, సరోజ పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

**ముథోల్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)** ముధోల్ మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన లక్ష్మి అనేమహిళ ఇంటికి సోమవారం ఉదయం ప్రమాదవశాత్తుగా నిప్పు అంటుకోని ఇల్లు దగ్ధమైంది. స్థానికులు కథనం ప్రకారం తన ఉన్న ఇంట్లోని దేవుళ్ళ కు దీపం ముట్టించి ఇతర గ్రామానికి బాధితురాలు బయలుదేరింది.అయితే ప్రమాదవశాత్తు ఆ దీపం ఇంటికి తగిలి మంటలు అంటుకున్నాయి. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు బాధితురాలికి ఫోన్ చేసి సమాచారంను చేరవేశారు. మంటలు చుట్టుపక్క వ్యాపించకుండా నీళ్లను స్థానికులు పోసి మంటలను ఆర్పి వేశారు. ఇంట్లో ఉన్న బట్టలు, ఆహార ధాన్యాలు, నగదు 20వేల రూపాయలు తదితరవి, కాలి బూడిద అయ్యాయని బాధితురాలు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్ఐ నారాయణ పటేల్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం కు గల వివరాలను అడిగి తెలుసుకున్నారు.స్థానికుల సమక్షంలో పంచనామ నిర్వహించారు. సుమారు 65 వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని చేసినట్లు బాధిత మహిళ తెలిపారు. ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు.



# ఆదర్శ పాఠశాలలో దరఖాస్తుల స్వీకరణ



**సిర్పూర్ (యు), సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)** మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలల్లో 2025-26 విద్య సంవత్సరానికి ఆరో తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులు సెప్టెంబర్ 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వెంకట స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు నుండి ఇంటర్ మొదటి సంత్సరం లో ఖాళీలు సెప్టెంబర్ 10 వరకే భర్తీ చేయడం జరుగుతుందని మరింత సమాచారం కోసం 9010750444 నంబర్‌లో సంప్రదించాల్నారు.

# పోచమ్మ చెరువు వద్ద నిమజ్జనం ఏర్పాట్లు



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పోచమ్మ చెరువు వద్ద నిమజ్జనం ఏర్పాట్లను మంచిర్యాల డీసీపీ శ్రీనివాస్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ పరిశీలించారు. ఈనెల 5వ తేదీన నవరాత్రి ఉత్సవాలు ముగుస్తాయి. నిమజ్జనోత్సవంలో భక్తులకు ఎలాంటి సౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా కట్టుదిట్టమైన భద్రతాఏర్పాట్లకు పలు సూచనలు చేశారు. భారీకేడ్లు, విద్యుత్ దీపాలు, గజ ఈతగాలను చెరువు వద్ద అందుబాటులో ఉండాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. వినాయక చవితి పండుగ ముగింపు ఉత్సవం నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరగడానికి తగిన ఏర్పాట్లు ఉండాలన్నారు. డీసీపీ శ్రీనివాసు, సబ్ కలెక్టర్ మనోజ్ వెంట బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, ఇతర అధికారులు ఉన్నారు.



# కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

**మంచిర్యాల, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)** మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్ లో బీఆర్ఎస్వి రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ ఆదేశాల మేరకు సోమవారం తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కేసీఆర్ చిత్రపటానికి, అమరవీరుల స్థూపానికి, తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్వి నియోజకవర్గ అధ్యక్షుడు దగ్గుల మధు కుమార్ ఆధ్వర్యంలో పాలా భిషేకం, జలాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ జాతిపిత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం తెలంగాణ సమాజాన్ని అవమానపరిచినట్లు అవుతుందన్నారు. సబ్బండ వర్గాల మేలు కోసం ఎనలేని కృషి చేసిన కేసీఆర్ ని దూషించడం అనేది ఆకాశ మీద ఉమ్మేసినట్టేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, లేకుంటే విద్యార్థి విభాగం తరపున రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని మంచిర్యాల బిఆర్ఎస్ విద్యార్థి విభాగం తరపున హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగ నాయకులు కాట మరాజు, నరేందర్ రెడ్డి, కందుల ప్రశాంత్, గోశిక మధుకర్, మహమ్మద్ సాజిద్, ఇరుగురాల వంశీ, కొత్త శ్రీనివాస్, గుమ్మల ప్రవీణ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ హైమద్, పట్టణ ప్రధాన కార్యదర్శి మెరుగు పవన్, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్వీ నాయకుని పుట్టినరోజు

**మందమర్రి, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)** పట్టణానికి చెందిన బీఅర్ఎస్వి సీనియర్ నాయకుడు ఆసిఫాబాద్ జిల్లా బీఅర్ఎస్వి ఇంచార్జ్ ఎండి ముస్తఫా జన్మదిన వేడుకలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం నిర్వహించిన జన్మదిన వేడుకల్లో పెద్దపెల్లి మాజీ ఎంపీ, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే మాజీ ప్రభుత్వ విప్ మంచిర్యాల జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు బాల్క సుమన్ సమక్షంలో కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఅర్ఎస్ దాని అనుబంధ సంఘ నాయకులు పాల్గొన్నారు.



# సీపీఎస్‌ను రద్దు చేసి.. ఓపీఎస్‌ను అమలు చేయాలి




**మంచిర్యాల, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)** కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) విధానాన్ని రద్దు చేయాల్సిందేనని, ఓల్డ్ పెన్షన్ స్కీం(ఓపీఎస్)ను అమలు చేయాలని ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మం చిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్‌లు, బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాలు నిర్వహించి నిరసన తెలిపారు. జేఏసీ పిలుపు మేరకు సెప్టెంబర్ 1ని పెన్షన్ వ్యతిరేక దినంగా పాటిస్తూ ఐక్య ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మంచిర్యా ల కలెక్టరేట్ వరకు ర్యాలీ తీశారు. నిరసన తెలిపి కలెక్ట ర్ దీపక్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు మా ట్లాడుతూ రెండు దశాబ్దాలుగా ఎందరో ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారని, సీపీఎస్ విధానం వల్ల వారి కుటుంబాలు నేడు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నాయ ని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసే వరకూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ మేనేజర్ ఎండీ మజార్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఉద్యో గ..ఉపాధ్యాయ జేఏసీ జిల్లా అధ్యక్షుడు లింగాల రాజశేఖర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రేకు వినతి పత్రం అందజేశారు. ధర్నాకు జిల్లా వైద్యాధికారి సీతా రాం మద్దతు తెలిపారు. మంచిర్యాలలో.. జేఏసీ ఉద్యో గ సంఘాల జనరల్ సెక్రెటరీ వనజా రెడ్డి, పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు ధరణి కోట వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి సూరినేని గంగాధర్, ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు, ప్రధాన కా ర్యదర్శి శంకర్ గౌడ్, టీఆర్ఈఎస్ఏ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ రావ్ దేశ్‌పాండే, జిల్లా ప్రధాన కార్యదర్శి లా వుద్య కృష్ణ, పీఆర్టీయూ టీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షురా లు బండ శాంకరి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాస రవి, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అసంపెల్లి రమేశ్, ప్రధాన కా ర్యదర్శి మోతె జయకృష్ణ, టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి పొ న్న మల్లయ్య, జిల్లా కార్యదర్శి సునీత, మండల పంచాయతీ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చక్రపాణి, ప్ర ధాన కార్యదర్శి రాజువేణు, టీఎస్‌జేఎఫ్‌డీ కాళేశరం థర్డ్ జోన్ అధ్యక్షుడు అబ్దుల్ ఆజాబ్, తెలంగాణ నర్సిం గ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గీట్ల సుమిత్, కార్యదర్శి గోవర్ధన్, 18 మండలాల ఉద్యోగులు, ఆసిఫాబాద్‌లో జేఏసీ నాయకులు శాంతికుమారి, ఉమర్ హుస్సేన్, ఊషన్న, హేమంత్ షిండే, ఏటుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# విజృంభిస్తున్న.. విష జ్వరాలు

- వైరల్ ఫీవర్, టైఫాయిడ్, డెంగ్యూ సతమతం
- మంచిర్యాల జిల్లాలో డెంగీ ఫియర్
- ఆస్పత్రులకు పరుగులు తీస్తున్న ప్రజలు

**మంచిర్యాల, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లాలో డెంగీ ఫీవర్ భయపడుతున్నది. పట్టణాలు, పల్లెల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారి దోమలు విజృంభిస్తుండగా, రోజు రోజుకూ కేసుల సంఖ్య పెరుగుతున్నది. ఇప్పటి వరకు టీహబ్‌లో2 వేలకుపైగా పరీక్షలు నిర్వహించగా, 25 పాజిటివ్ కేసులు వచ్చినట్లు తేలింది. డెంగీ వచ్చిన వారంతా ప్రైవేట్ హాస్పిటళ్లకు పరుగులు పెడుతుండగా, యజమానులు ఇదే అదనుగా భావించి రూ. లక్షలు దండుకుంటున్నట్లు తెలుస్తున్నది. నిన్నమొన్నటి వరకు ప్రతి రోజూ ప్రభుత్వ దవాఖానకు 400 మంది ఓపీ పేషెంట్లు రాగా, ప్రస్తుతంవెయ్యికిపైగా పెరగడం ఆందోళనకు గురిచేస్తున్నది.

**25కు పాజిటివ్ కేసులు..**
ఈ యేడాది ఇప్పటి వరకు 25 మందికి డెంగీ జ్వరం వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో మంచిర్యాల మండలం జన్నారం 2, తాళ్లపేట 2, దండెపల్లి 3, వెంకట్రావుపేట 2, మందమర్రి 2, పాత మంచిర్యాల 1, చెన్నూర్ మండలానికి సంబంధించి అంగరాజ్‌పల్లి 1, బెల్లంపల్లి మండలంలోని భీమిని 1, తాండూర్ 2, తాళ్లగురిజాల 4, షంశీర్‌నగర్ 5 కేసులు నమోదయ్యాయి. మలేరియాకు సంబంధించి 2 కేసులు నమోదయ్యాయి.

**విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు**
ఓ వైపు డింగీ టెన్సన్ పెడుతుంటే.. మరోవైపు సీజనల్ వ్యాధులు విజృంభిస్తూ ఆందోళనకు గురిచేస్తున్నాయి. పల్లెలు, పట్టణాల్లో జ్వరబాధితులు పెరుగుతున్నారు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసింది. ఈ బృందంలో జిల్లా మలేరియా నియంత్రణ అధికారి, మలేరియా నియంత్రణ సహాయ అధికారి, ముగ్గురు సబ్ యూనిట్ ఆఫీసర్లు ఉన్నారు. వీరు ఎప్పటికప్పుడు సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేస్తున్నారు. ప్రస్తుతం కేసులు నమోదైన చోట జ్వర సర్వేలు నిర్వహిస్తున్నా రు. కేసులు వచ్చిన చోట్ల చుట్టుపకల ఇండ్లను కూడా పూ ర్తిగా పరీక్షిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 2 లక్షల ఇం డ్లలో జర్వ సర్వే చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అం దులో జలుగు, జ్వరం, దగ్గు, ఒళ్లునొప్పులు, ఇతర సీజనల్ వ్యాధులు, జ్వరాలు ఉన్నట్లు తెలింది. తీవ్ర జ్వరం ఉన్న వారిని ప్రభుత్వ హాస్పిటల్, పీహెచ్‌సీలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అక్కడే మందులను అందజేస్తున్నారు.

**బ్రీడింగ్ చెక్కర్స్‌తో సర్వే..**
పట్టణాలు, పల్లెల్లో జ్వర బాధితులను గుర్తించడానికి ప్రత్యేకంగా బ్రీడింగ్ చక్కర్స్‌తో సర్వే నిర్వహిస్తున్నారు. పదో తరగతి పూర్తి చేసిన 15 మంది విద్యార్థులు, సిబ్బంది ప్రతి రోజూ 100 ఇండ్లలో సర్వే చేస్తున్నారు. వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. జ్వర అనుమానితులున్నైట్లైతే అధికారులకు సమాచారం ఇస్తున్నారు.

**ప్లేట్‌లెట్స్ తగ్గితే డెంగీ అని నిర్ధారించుకోవద్దు...**
రక్తపరీక్ష చేసుకున్నప్పుడు ప్లేట్‌లెట్స్ తగ్గితే డెంగీ జ్వరం వచ్చినట్లు నిర్ధారించుకోవద్దు. టైఫాయిడ్, టీబీ, ఇతర వైరల్ ఫీవర్‌లో కూడా ప్లేట్‌లెట్స్ తగ్గుతాయి. ర్యాపిడ్ టెస్ట్ చేసుకున్న తర్వాత డెంగీ అనుమానమున్నట్లు తెలితే శాంపిళ్లు సేకరించి టీ హబ్‌కు పంపిస్తాం. ఎలీజా టెస్ట్ చేసిన తర్వాత అందులో పాజిటివ్ వస్తేనే డెంగీ వచ్చినట్లు. దవాఖానాల్లో మలేరియా, డెంగీ కిట్స్ అందుబాటులో ఉన్నాయి.



## కేంద్రం నిర్లక్ష్యంతోనే యూరియా కొరత


### టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రహమత్ హుస్సేన్

**మంచిర్యాల, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, పెద్దపల్లి పార్లమెంట్ ఇంఛార్జ్ రహ మత్ హుస్సేన్ అన్నారు. సోమవారం మం చిర్యాల ఎమ్మెల్యే నివాసంలో నియోజక వర్గంలోని కాంగ్రెస్ ముఖ్య నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడిన వారికి న్యాయం జరుగుతుందని, రానున్న స్థానిక ఎన్నికల్లో వారికే మొదటి స్థానం కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు ప్రాధాన్యత కల్పిస్తుందని, ఇందు లో భాగంగానే 2018లో బీఆర్ఎస్ 50 శాతం రిజర్వేషన్ నియంత్రణ బిల్లును కొట్టే స్తూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదం కోసం గవర్నర్ కు బిల్లు పంపిందన్నారు. అనంతరం నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, బ్లాక్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పూదరి తిరుపతి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల నరేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం త్రిమూర్తి, ఒడ్డె రాజ మౌళి, మునీ పాల్గొన్నారు.

## 20మందిపై కేసు నమోదు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో పోలీసు చట్టం-30 అమల్లో ఉన్నప్పటికి ఎలాంటి అనుమతులు లేకుండా ఆందోళనలకు పూనుకున్న 20 మందిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఇన్స్పెక్టర్ కే.నాగరాజు తెలిపారు. సాత్నాల మండలం సలాయితండాకు చెందిన చౌహాన్ కమలాబాయి చేనులో మృతి చెందగా శవ పరీక్ష కోసం రిమ్స్ మార్చురీకి గత నెల 30న తరలించారన్నారు. ఆమె మృతికి రెవెన్యూ అధికారులే కారణమంటూ ఆ రోజు రిమ్స్ శవాగారం వద్ద, కలెక్టర్ కార్యాలయం ముందు ఆమె బంధువులు ఆందోళనలు చేపట్టి ప్రజా జీవనానికి భంగం కలిగించటంతో పాటు పోలీసుల విధులకు ఆటంకం కలిగించారన్నారు. ఈ మేరకు టూటౌన్ ఎస్ఐ విష్ణుప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చౌహాన్ దత్తు, అంకుష్, కైరాం, రాఠోడ్ దినేష్,రాఠోడ్ శ్యాంరావు, రాంలాల్, సంతోష్, జగన్‌తో పాటు మరో 12 మందిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

# బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి



### ప్రజా ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ కాంతిలాల్ పాటిల్

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం రోజు జిల్లా ఎస్.పి. కాంతిలాల్ పాటిల్ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదుదారుల సమస్యలను విని, వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేయడమైనది. సోమవారం రోజు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత సర్కిల్ ఇన్స్పెక్టర్‌లతో ఫోన్‌లో ద్వారా మాట్లాడి సమస్య స్థితిని మరియు పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకొనేల, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా ఎస్.పి. కాంతిలాల్ పాటిల్ తెలియజేశారు. ప్రజా సమస్యలు పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నాము అని తెలియజేశారు.

# బీసీ బిల్లు ఆమోదం చారిత్రాత్మక విజయం

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% బీసీల బిల్లు అసెంబ్లీ సమావేశాలలో ఆమోదం పొందడంపై ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డిల నేతృత్వంలో వేరువేరుగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి రాజ్యాంగ నిర్మాత అంబెడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనం తరం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ల ఫ్లెక్సీ లకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం టపాసులు పేల్చి, మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకొన్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ కంది శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన క్యాంపు కార్యాలయం వద్ద నాయకులు సంబరాలు చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జాతీ య, రాష్ట్ర నేతల ఫ్లెక్సీ లకు పాలాభిషేకం చేశారు. పార్టీ నేతలు మాట్లాడుతూ... మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు అమలు చేసే ఘనత కాంగ్రెస్ పార్టీ కే దక్కుతుందన్నారు. 10 ఏళ్ళు అధికారంలో ఉండి కేసీఆర్ బీసీలను అనగదొక్కారని.. కేసీఆర్ చేసిన బీసీ బిల్లు బీసీ లకు మరణ శాసనం అయ్యిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కాంగ్రెస్ శ్రేణులు ప్రజల్లోకి ఈ విషయాన్నీ విస్తృతంగా తీసుకువెళ్లి అవగాహన కల్పించాలని కోరారు. బిల్లుకు మద్దతు తెలిపిన ప్రతిపక్ష నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# న్యాయం చేయాలని వృద్ధురాలి ఆందోళన

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
చింతలమానేపల్లి మండలం డబ్బ గ్రామానికి చెందిన 90 సంవత్సరాల వృద్ధురాలు, ఆమె కుటుంబ సభ్యులు సోమవారం కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వృద్ధురాలు చాపిడి సోంబాయి కి సంబంధించిన భూమిని కొందరు వ్యక్తులు ఆమె మృతి చెందినట్లు రికార్డులు సృష్టించి, పట్టా చేసుకున్నారు. ఈ విషయంలో వృద్ధురాలు గత నె ల నాలుగో తేదీన సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టగా, సత్వరమే స్పందించిన సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల స్పష్టమై న హామీ ఇవ్వడంతో వృద్ధురాలు ఆందోళన విరమించింది. గత రెండు రోజుల క్రితం మళ్లీ ఆ భూమిలో ప్రహరీ నిర్మాణానికి ప్రజా ప్రతినిధులు భూమి పూజ చేయడంతో వృద్ధురాలు పాటు, ఆమె కుటుంబ సభ్యు లు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని ఆ వృద్ధురాలు అధికారులను వేడుకుంది. ఆమెతోపాటు కూతుర్లు రుక్మిణి, విమల మనమరాళ్లు లక్ష్మి, జ్యోతి ఆందోళన చేస్తున్న వారిలో ఉన్నారు. సిపిఎం పార్టీ కార్యదర్శి ముంజం ఆనంద్ కుమార్, తదితరులు ఆందోళనకు మద్దతు తెలిపారు.





## వరద నష్టంపై నివేదికలు పంపండి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల వలన జరిగిన ప్రాణ-ఆస్తి నష్టాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా అంచనా వేసి తక్షణం నివేదికలు సమర్పించాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ సచివాలయం నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం వరద నష్టం పై సమీక్షించారు. ఈ సమా వేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదిత రులు పాల్గొన్నారు. జిల్లాల కలెక్టర్లతో నేరుగా మాట్లాడిన ముఖ్యమంత్రి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని, పంట నష్టం, ఇళ్ల దెబ్బతినడం, రహదారులు, చెరువులు, వంతెనలకు జరిగిన నష్టాలను విభాగాలవారీగా ఖచ్చితంగా లెక్కించి సమర్పించా లని ఆదేశించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌లు పాల్గొన్నారు.



## పింఛన్ల పంపిణీ సక్రమంగా చేపట్టాలి

**మందమర్రి, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
మండలంలోని వివిధ గ్రామపంచాయతీలలో పోస్ట్ ఆఫీస్‌ల ద్వారా పంపిణీ చేస్తున్న పింఛన్లను సక్రమంగా పంపిణీ చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎన్.రాజేశ్వర్ అన్నారు. సోమవారం మండలంలోని పులిమడుగు గ్రామ పంచాయతీలో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ ఆధ్వర్యంలో చేపట్టిన పింఛన్ల పంపిణీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ల పంపిణీలో ఎలాంటి అవకతవ కలు జరగకుండా పారదర్శకంగా లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. గ్రామ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.







# బీసీ బిల్లు ఆమోదం పట్ల హర్షం

**ఉట్నూర్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఏకగ్రీవ ఆమోదం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఏఐసీసీ టీపీసీసీ ఆదేశాల మేరకు సంబరాలు జరుపుకున్నారు. ఉట్నూర్ బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సయ్యద్ ఎక్బాల్, ఖానాపూర్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆత్రం రాహుల్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేద్కర్ చౌక్ లో పెద్ద ఎత్తున హాజరై సంబరాలు జరుపుకొన్నారు.సీఎం రేవంత్ రెడ్డికి, ప్రభుత్వానికి మద్దతుగా పెద్దపెట్టున నినాదాలు చేశారు .బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. బీసీ నేతలందరు ప్రభుత్వానికి సీయం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు సరైన న్యాయం చేసిందన్నారు. 42 శాతం రిజర్వేషన్‌తో సత్కరించిందన్నారు. ఈ బిల్లు పట్ల కేవలం బీసీలు మాత్రమే కాకుండా ప్రజలందరూ కూడా హర్షిస్తున్నారన్నారు. బిజెపి బీఆర్ఎస్ లు బీసీలను కేవలం ఓటు బ్యాంకు గానే చూశాయని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వాళ్లకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి సరైన న్యాయం చేసిందన్నారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

### ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖాడే ఉత్తం

**ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
కాంగ్రెస్ పార్టీ మాటిస్తే కచ్చితంగా నిలబెట్టుకుందని, సబ్బండ వర్గాలకు న్యాయం చేస్తుందని ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖాడే ఉత్తం పేర్కొన్నారు. సోమవారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి,ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖాడే ఉత్తం మాట్లాడుతూ... ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ పార్టీ నెరవేరుస్తుందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని శాసన సభలో చట్ట సవరణ బిల్లు ప్రవేశ పెట్టడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎండి జహీర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్ ఇమ్రాన్, మాజీ వైస్ ఎంపీపీ గోపాల్ సింగ్, నాయకులు సోన్ కాంబ్లే జితేందర్,మీర్జా యాకూబ్ బెగ్, సోమాసే వెంకటరావు, ఫడ్ వరుణ్ పాటిల్, సోమోరే నాగోరావు, కాంబ్లే బాపురావు, కొమరయ్య, మాణిక్ రావు, జునేద్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# జిల్లా ఎస్పీని కలిసిన అదన ఏఎస్పీ

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, కాగజ్‌నగర్ డిఎస్పీగా పనిచేసిన బి.రామానుజం అదనపు ఎస్పీగా పదోన్నతి పొందిన సందర్భంగా సోమవారం జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించారు. ఎస్పీ వారికి సింహతలాటం బ్యాడ్జిని తొడిగి, శుభాకాంక్షలు తెలిపారు. అదనపు ఎస్పీ రామానుజం పదోన్నతి పై డిజిపి ఆఫీసులో రిపోర్ట్ చేయవలసిందిగా, డిజిపి కార్యాలయం నుండి ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.



### కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను

# కాంగ్రెస్ అమలు చేసింది



**నిర్మల్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
అసెంబ్లీలో బీసీ బిల్లు ఆమోదం చరిత్రాత్మక విజయమని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి విశ్రాంతి భవనంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్ చట్ట సవరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులను శాసనసభ ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తోందన్నారు. బీసీలకు న్యాయం చేసే దిశగా కాంగ్రెస్ ముందుకు వెళ్తుంటే బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. అనంతరం సంబరాలు చేసుకున్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట టపాసులు పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. జిల్లా కాంగ్రెస్ ఇంచార్జ్ రామ్ భూపాల్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

# బీసీ బిల్లు చారిత్రాత్మకమైనది

**కుభీర్, సెప్టెంబర్ 1 (ప్రభాత సమాచారం)**
కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే విధంగా బీసీ బిల్లును రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించడం చారిత్రాత్మక నిర్ణయం అని బీసీ సంఘం నేత మాజీ నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంచాల శ్రీకాంత్ యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాల ప్రజల కోసమే కామారెడ్డిలో ఇచ్చిన బీసీ డిక్లరేషన్ ఆమె మేరకు ఈ బిల్లును తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఈ బిల్లు వల్ల బీసీలకు ప్రయోజనం చేకూరుస్తుందని, కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయంపై బీసీలందరూ కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.